# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in






సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 146 | పేజీలు : 08 | బుధవారం | 03-06-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## తెలంగాణ నాలుగు
# కోట్ల మంది జాగీర్



- పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్
- తెలంగాణ ఇక్కడి భూమిపుత్రుల జాగీరని వ్యాఖ్య
- పవన్ ఎక్కడైనా పోటీ చేసుకోవచ్చన్న కేటీఆర్
- కానీ, సెక్రటేరియట్‌లో పెత్తనం చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు

2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ ఇక్కడున్న నాలుగు కోట్ల మంది భూమి పుత్రుల జాగీరని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. అయితే, ఇక్కడికి ఎవరైనా రావొచ్చని స్పష్టం చేశారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణకు వస్తే అడ్డుకుంటామని ఎవరూ చెప్పలేదని పేర్కొన్నారు. అయితే తెలంగాణ ఆవిర్భావం రోజు హైదరాబాద్‌లో సభ

## అవును, తెలంగాణ మా జాగీరే

### పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు గద్దర్ కూతురు కౌంటర్

- తెలంగాణ మీ జాగీరా అన్న పవన్ వ్యాఖ్యలను ఖండించిన వెన్నెల
- తెలంగాణ గడ్డ నిన్న, నేడు, రేపు మా జాగీరేనంటూ కౌంటర్
- తెలంగాణ పోరాటాలతో, ఆత్మబలిదానాలతో వచ్చిందన్న వెన్నెల

2



## సీఎం రేవంత్‌తో దక్షిణాఫ్రికా
# డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ




- తెలంగాణలో పెట్టుబడులు, వాణిజ్యంపై ప్రధానంగా చర్చలు
- ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో సహకారానికి అంగీకారం
- పెట్టుబడులకు పూర్తి సహకారం అందిస్తామని సీఎం రేవంత్ హామీ

2

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణ, దక్షిణాఫ్రికా మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసే దిశగా కీలక అడుగుపడింది. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ షిపోకోసా పాలస్ మషాటిలే బృందం సమావేశమైంది. హైదరాబాద్‌లోని ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన ఈ భేటీలో ఇరుపక్షాల మధ్య పెట్టుబడులు, వాణిజ్య అవకాశాలపై ప్రధానంగా చర్చించారు.సమాచార సాంకేతికత (ఐటీ), ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, విద్య, నైపుణ్యాభివృద్ధి, మెడికల్ టూరిజం వంటి కీలక రంగాల్లో పరస్పర సహకారంపై చర్చించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు



## ఢిల్లీలో భారీ
# అగ్ని ప్రమాదం..

### 21 మంది సజీవ దహనం

- లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో ఘటన
- పలువురికి తీవ్ర గాయాలు
- 37 మందిని కాపాడిన పోలీసులు
- మంటల్ని అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది
- చినపోయిన వారికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన ప్రధాని

2



## ఇరాన్‌తో
# చర్చలు ఆగలేదు

2

- ఇరాన్‌తో చర్చలు ఆగిపోయాయన్న వార్తలను ఖండించిన ట్రంప్
- నిరంతరాయంగా చర్చలు కొనసాగుతున్నాయని స్పష్టీకరణ
- ఇటీవలి రోజుల్లో కూడా సంభాషణలు జరిగాయన్న అమెరికా అధ్యక్షుడు
- అణు కార్యక్రమం, హార్ముజ్ జలసంధి వంటి అంశాలపై చర్చలు

# ఆరోగ్యమే అసలైన సంపద..

### జీవనశైలి మార్చుకోవాలి: సీఎం చంద్రబాబు

- గుంటూరులో లలితా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- అమరావతిని గ్లోబల్ హెల్త్ హబ్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటన
- సంజీవని ప్రాజెక్టు, యూనివర్సల్ హెల్త్ పాలసీ వివరాలు వెల్లడి
- గత ప్రభుత్వంలో నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతిన్నదని విమర్శ
- ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ప్రజలకు సూచన

2

హైదరాబాద్ పల్స్,అమరావతి

రాజధాని అమరావతిని భవిష్యత్తులో ప్రపంచస్థాయి ఆరోగ్య కేంద్రంగా (గ్లోబల్ హెల్త్ హబ్) తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. గతంలో హైదరాబాద్‌లో హెల్త్ టూరిజాన్ని ప్రోత్సహించిన విధంగానే రాబోయే రోజుల్లో ప్రపంచ నలుమూలల నుంచి రోగులు అమరావతికి వచ్చి చికిత్స పొందే



## ఇరాన్ కొత్త సుప్రీం లీడర్
# బతికే ఉన్నారు

### అమెరికా కీలక ప్రకటన



- ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మోజ్తబా ఖమేనీ బతికే ఉన్నారన్న అమెరికా
- అణు చర్చల్లో ఆయన క్రియాశీలకంగా పాల్గొంటున్నారన్న అమెరికా
- విదేశాంగ మంత్రి మార్కో రూబియో పదవి చేపట్టినప్పటి నుంచీ బహిరంగంగా కనిపించని మోజ్తబా

హైదరాబాద్ పల్స్,డెస్క్

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మోజ్తబా ఖమేనీ బతికే ఉన్నారని, ఆయన అమెరికాతో జరుగుతున్న పరోక్ష అణు చర్చల్లో చురుకుగా పాలుపంచుకుంటున్నారని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పష్టం చేశారు. పదవి చేపట్టిన తర్వాత మోజ్తబా ఒక్కసారి కూడా బహిరంగంగా

2



## తెలంగాణకు
# వర్ష సూచన

### 18 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

- ఈరోజు, రేపు తెలంగాణలోని పలు జిల్లాలకు వర్ష సూచన
- 18 జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం
- రేపటి లోగా కేరళ, తమిళనాడును తాకనున్న నైరుతి రుతుపవనాలు

2

# జూన్ 5 నుంచి కొత్త రేట్లు!

- తెలంగాణలో పెరగనున్న భూముల విలువలు..
- భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల మార్కెట్ విలువ సవరణ
- పెరగనున్న స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు
- శాస్త్రీయ పద్ధతిలో విలువలు సవరించినట్టు తెలిపిన మంత్రి పొంగులేటి

2



## తప్పుడు ప్రచారాలు చేస్తే..
# క్రిమినల్ కేసులు తప్పవు



2

- ప్రభుత్వంపై బురదజల్లడం వైసీపీకి అలవాటుగా మారిందన్న అనిత
- ఉపాధ్యాయులను మద్యం దుకాణాల ముందు నిలబెట్టిన ఘనత వైసీపీది అని విమర్శ
- డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక

## కువైట్ ఎయిర్‌పోర్ట్‌పై
# ఇరాన్ దాడి..

### నిలిచిపోయిన విమాన సర్వీసులు

- కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణుల దాడి
- టెర్మినల్ 1 ధ్వంసం, పలువురికి గాయాలు
- విమాన సర్వీసులు నిరవధికంగా రద్దు,విమానాల దారి మళ్లింపు
- గల్ఫ్ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత, బలగాల అప్రమత్తత

2




# సీఎంగా డీకే శివకుమార్

- కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం
- కొలువుదీరిన కొత్త ప్రభుత్వం
- కర్ణాటకలో నయా సర్కార్-ముఖ్యమంత్రిగా డీకే ప్రమాణం
- ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న పరమేశ్వర!

హైదరాబాద్ పల్స్,డెస్క్

కర్ణాటకలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ ప్రమాణస్వీకారం చేశారు. లోక్ భవన్‌లోని గ్లాస్‌హౌస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ థావర్ చంద్ గహ్లోత్ డీకే శివకుమార్‌తో ప్రమాణం చేయించారు. అలాగే సీనియర్ నేత జి.పరమేశ్వర్ ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ ఇద్దరితోపాటు మరో 12 మంది మంత్రులుగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేసీ

2



# ఢిల్లీలో భారీ అగ్ని ప్రమాదం..

మొదటి పేజీ రువాయి

ఢిల్లీలో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 21 మంది సజీవ దహనమయ్యారు. అనేక మందికి తీవ్ర గాయాలయ్యాయి. 10 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు 40 మందిని కాపాడారు. మాలవీయనగర్‌లోని లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో ఉదయం 9 గంటల సమయంలో మంటలు చెలరేగుతున్నట్లు గుర్తించారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాయి. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు షార్ట్ సర్క్యూటే కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా నిర్ధారించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి.ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స కోసం రూ.50 వేలు అందజేస్తామన్నారు.

# ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ బతికే ఉన్నారు

మొదటి పేజీ రువాయి

కనిపించకపోవడంతో ఆయన ఆరోగ్యంపై నెలకొన్న ఊహాగానాలకు రూబియో ప్రకటన తెరదించింది.మంగళవారం సెనేట్ విదేశీ సంబంధాల కమిటీ ముందు రూబియో సాక్ష్యమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మొజ్తబా ఖమేనీ నిర్ణయాల్లో క్రియాశీలకంగా పాల్గొంటున్నారని చెప్పడానికి స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. అయితే అన్ని సంప్రదింపులు కేవలం రాతపూర్వకంగా, మధ్యవర్తుల ద్వారానే జరుగుతున్నాయి" అని వివరించారు.ఫిబ్రవరి 28, 2026న అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ఆయన కుమారుడైన 56 ఏళ్ల మొజ్తబా ఖమేనీ బాధ్యతలు చేపట్టారు. ఆ దాడుల్లో మొజ్తబా కూడా గాయపడ్డారని వార్తలు వచ్చాయి. అప్పటి నుంచి ఆయన బయట కనిపించలేదు. దీంతో ఆయన జీవించే ఉన్నారా? లేదా? అనే దానిపై అమెరికా సహా అంతర్జాతీయంగా అనేక ఊహాగానాలు వచ్చిన సంగతి తెలిసిందే.ఈ క్రమంలో ఆ ఊహాగానాలను తెరదించుతూ మార్కో రూబియో కీలక ప్రకటన చేశారు. మొజ్తబా ఖమేనీ ఇరాన్ అంతర్గత, దౌత్యపరమైన విషయాలలో ఏదో ఒక స్థాయిలో పాలుపంచుకుంటున్నారనే సంకేతాలు తమకు అందుతున్నాయన్నారు. ప్రస్తుతం ఇరాన్ ఉన్న పరిస్థితుల్లో అక్కడి నాయకులు బహిరంగంగా బయటకు రావడం క్షేమకరం కాదని ఆ దేశ అంతర్గత వర్గాలు భవించి ఉండవచ్చని కానీ ఆయన కచ్చితంగా సజీవంగానే ఉన్నారని రుబియో పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్ ప్రెసిడెంట్ మసౌద్ పెజెష్కియాన్ సైతం ఇటీవల మాట్లాడుతూ సుప్రీం లీడర్ అనుమతి లేకుండా దేశంలో ఎలాంటి కీలక నిర్ణయాలు జరగవని పేర్కొన్నారు.

### కువైట్ ఎయిర్‌పోర్ట్‌పై

# ఇరాన్ దాడి..

మొదటి పేజీ రువాయి

గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయంపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణులతో భీకర దాడికి పాల్పడింది. బుధవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో ఎయిర్‌పోర్ట్‌లోని ఒక ప్యాసింజర్ టెర్మినల్ తీవ్రంగా దెబ్బతింది.ఎయిర్‌పోర్ట్‌లోని టీ1 ప్యాసింజర్ భవనంపై ఇరాన్‌కు చెందిన డ్రోన్లు దాడి చేశాయి. విమానాశ్రయ భవనానికి భారీగా నష్టం వాటిల్లినట్లు కువైట్ ప్రభుత్వం వెల్లడించింది. దాడి నేపథ్యంలో అధికారులు విమానాశ్రయాన్ని తాత్కాలికంగా మూసివేసి, అన్ని విమాన సర్వీసులను నిలిపివేశారు.ఈ దాడిని కువైట్ రక్షణ మంత్రిత్వ శాఖ తీవ్రంగా ఖండించింది. మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి, బ్రిగేడియర్ జనరల్ సౌద్ అబ్దుల్‌అజీజ్ అల్–ఒతైబీ మాట్లాడుతూ, "ఇది ఇరాన్ చేసిన నేరపూరిత దురాక్రమణ. శత్రు డ్రోన్లు నేరుగా ప్రయాణికుల భవనాన్ని లక్ష్యంగా చేసుకున్నాయి. ఈ దాడి వల్ల భవనానికి తీవ్ర నష్టం కలగడంతో పాటు పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారికి అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నాం" అని తెలిపారు.పరిస్థితిని భద్రతా దళాలు నిశితంగా గమనిస్తున్నాయని, ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కోవడానికి పూర్తి సన్నద్ధతతో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈ దాడుల్లో తమ సైనికులకు ఎలాంటి నష్టం జరగలేదని ఇరాన్ స్పష్టం చేసింది. దాడి సమయంలో కువైట్, బహ్రెయిన్ దళాలు కూడా తమ రక్షణ వ్యవస్థలను యాక్టివేట్ చేశాయి.ఫిబ్రవరిలో మొదలైన ఘర్షణల తర్వాత, ఇటీవలే కువైట్ ఎయిర్‌పోర్ట్ కార్యకలాపాలు తిరిగి ప్రారంభమయ్యాయి. తాజా దాడితో గల్ఫ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు రాజుకున్నాయి. కువైట్ అధికారులు సైనిక బలగాలను హై అలర్ట్‌లో ఉంచారు. అంతర్జాతీయ విమానయాన సంస్థలు తమ సర్వీసుల మార్గాలను మళ్లిస్తున్నాయి.

# సీఎం రేవంత్‌తో దక్షిణాఫ్రికా డిప్యూటీ ప్రెసిడెంట్ భేటీ

మొదటి పేజీ రువాయి

ఆసక్తి చూపే దక్షిణాఫ్రికా కంపెనీలకు, పారిశ్రామికవేత్తలకు పూర్తి మద్దతు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జీసీసీ) హైదరాబాద్ కేంద్రంగా మారిందని, ప్రపంచస్థాయి వైద్య సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. ఈ ఏడాది డిసెంబర్‌లో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు దక్షిణాఫ్రికా ప్రతినిధి బృందాన్ని సీఎం ఆహ్వానించారు. ఈ సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనరసింహ కూడా పాల్గొన్నారు.భారత్, దక్షిణాఫ్రికా మధ్య చారిత్రక బంధం ఉందని డిప్యూటీ ప్రెసిడెంట్ మషాటిలే గుర్తుచేశారు. ఆఫ్రికన్ కాంటినెంటల్ ఫ్రీ ట్రేడ్ ఏరియా ద్వారా తెలంగాణ కంపెనీలకు విస్తృత మార్కెట్ అవకాశాలు లభిస్తాయని, ముఖ్యంగా ఫార్మా రంగంలో స్థానికంగా ఉత్పత్తి భాగస్వామ్యాలను ప్రోత్సహిస్తామని ఆయన తెలిపారు.



# తెలంగాణ నాలుగు కోట్ల మంది జాగీర్

మొదటి పేజీ రువాయి

పెడతానంటే ఎలా? అని ప్రశ్నించారు. "తెలంగాణ మీ అయ్య జాగీరా?" అంటూ మంగళవారం పవన్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రాంతీయవాదం.. ఉగ్రవాదం కంటే ప్రమాదం అన్న పవన్ వ్యాఖ్యలను కేటీఆర్ తప్పుబట్టారు. మద్రాస్ నుంచి వేర్పాటు కోసం ఆత్మబలిదానం చేసిన పొట్టి శ్రీరాములుది కూడా ప్రాంతీయవాదమేనా అని ప్రశ్నించారు. తెలంగాణకు వస్తున్న అనేక పరిశ్రమలను ప్రధాని మోదీ తన స్వరాష్ట్రం గుజరాత్‌కు తరలించుకుపోతున్నారని కేటీఆర్ ఈ సందర్భంగా ఆరోపించారు. "జాతీయవాదం ముసుగులో మోదీ చేస్తున్న ఆర్థిక ప్రాంతీయవాదాన్ని ఏమంటారు?" అని ప్రశ్నించారు.దేశంలో ఎవరైనా ఎక్కడైనా పార్టీ పెట్టుకోవచ్చని కేటీఆర్ అన్నారు. అలాగే ఎక్కడైనా పోటీ చేసే హక్కు ఉందని తెలిపారు. జనసేన కొత్తగా పోటీ చేసేదేముందని.. 2018, 2023లో జనసేన తెలంగాణలో పోటీ చేయలేదా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడినప్పుడు 11 రోజులు అన్నం తినలేదన్న పవన్ వ్యాఖ్యలను ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. అదే వ్యక్తి మళ్లీ తెలంగాణకు వ్యతిరేకం కాదంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణకు 'ఓజీ' కేసీఆర్ అని.. ఇంకెవ్వరూ అవసరం లేదన్నారు.ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్‌ను గౌరవిస్తామని కేటీఆర్ అన్నారు. సోదరుడిగా ఇంటికొస్తే బిర్యానీ పెడతామని వ్యాఖ్యానించారు. సినీ నటుడిగా, కళాకారుడిగా అభిమానిస్తాం. కానీ, సెక్రటేరియట్‌లోకి వచ్చి పెత్తనం చేస్తామంటే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# తెలంగాణకు వర్ష సూచన

మొదటి పేజీ రువాయి

తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈరోజు, రేపు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ముఖ్యంగా ఉత్తర, తూర్పు, దక్షిణ తెలంగాణ జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం ఉండనుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండతో కలిపి మొత్తం 18 జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు 'ఆరెంజ్' అలర్ట్ ప్రకటించారు.ఈ భారీ వర్షాలతో పాటు బలమైన ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములు, మెరుపులు సంభవించే ప్రమాదం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. మరోవైపు, దేశవ్యాప్తంగా ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు రేపటిలోగా కేరళ, తమిళనాడు తీరాలను తాకనున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న రాత్రి నుంచే పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో రాత్రంతా ఎడతెరిపి లేకుండా వాన కురిసింది. రాబోయే రెండు రోజులు మరిన్ని భారీ వర్షాల సూచన ఉన్నందున, ముఖ్యంగా రైతులు, గ్రామీణ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# అవును, తెలంగాణ మా జాగీరే

మొదటి పేజీ రువాయి

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై గద్దర్ కూతురు వెన్నెల తీవ్రంగా స్పందించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున పవన్ మాట్లాడిన మాటలు తెలంగాణ అస్తిత్వాన్ని, తన తండ్రి వారసత్వాన్ని అవమానించేలా ఉన్నాయని ఆమె మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం సోషల్ మీడియాలో ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు."పవనన్న, మిమ్మల్ని ఒక నటుడిగా, గద్దరన్న అభిమానిగా తెలంగాణ ప్రజలు గౌరవిస్తారు. కానీ, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు మీరు మాట్లాడిన మాటలను ఒక తెలంగాణ ఆడబిడ్డగా నేను ఖండిస్తున్నాను" అని వెన్నెల స్పష్టం చేశారు. "తెలంగాణ మీ జాగీరా అని అడిగారు. అవును, తెలంగాణ గడ్డ నిన్న మా అయ్యల జాగీరే. ఈరోజు మా జాగీరు. రేపు మా బిడ్డల జాగీరు. ఇది ముమ్మాటికీ మా జాగీరే" అంటూ ఆమె ఘాటుగా బదులిచ్చారు.పైసలు పంచితే, లాబీలు చేస్తే తెలంగాణ రాలేదని, పోరాటాలతో వచ్చిందని అన్నారు. ఎవరినీ బాధపెట్టకుండా, హింసించకుండా, తమకు తాము ప్రాణాలు అర్పించుకుని తెలంగాణ సాధించుకున్నామని అన్నారు. ఇందుకు శ్రీకాంతచారి ఉదాహరణ అని చెప్పారు. పల్లెపల్లెలో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్నామని అన్నారు. తెలంగాణ కోసం ఎంతోమంది ప్రాణాలు అర్పించారని అన్నారు.తెలంగాణలో జనసేన పార్టీని విస్తరించి, జీహెచ్‌ఎంసీ, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని జూన్ 2న హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ ప్రకటించారు. ప్రాంతీయవాదం ఉగ్రవాదం కన్నా ప్రమాదకరమని, తెలంగాణ ఎవరి జాగీరు కాదని అన్నారు. గద్దర్‌కు తాను వాహనం కొనిచ్చి సహాయం చేశానని గుర్తుచేసుకుంటూ, ఏపీలో ఆయన విగ్రహం ఏర్పాటు చేస్తానని కూడా తెలిపారు.

# సీఎంగా డీకే శివకుమార్

మొదటి పేజీ రువాయి

వేణుగోపాల్, కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య, కేరళ సీఎం సతీశన్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అజారుద్దీన్ హాజరయ్యారు.

**చేతిలో రాజ్యాంగం**

ప్రమాణ స్వీకారానికి ముందు డీకే వేదికపై నుంచి ప్రజలకు సాష్టాంగ నమస్కారం చేశారు. ఆ తర్వాత తాజా మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను డీకే సత్కరించారు. అనంతరం తన తాతయ్య గంగాధరయ్య చిత్రపటానికి నివాళులర్పించి ఆయన్ను స్మరించుకుంటూ కర్ణాటక రాష్ట్రానికి 34వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆ సమయంలో డీకే చేతిలో రాజ్యంగం బుక్ అందర్నీ ఆకర్షించింది. చేతిలో రాజ్యాంగం బుక?ను పట్టుకుని అయన ప్రమాణం చేశారు.

**మంత్రులుగా సిద్ధరామయ్య, ఖర్గే కుమారులు**

కాగా, డీకే కేబినెట్ లో మాజీ సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్ర, ఖర్గే కుమారుడు ప్రియాంక్ ఖర్గేకు మంత్రివర్గంలో చోటు దక్కింది. వీళ్లతోపాటుగా కె.హెచ్.మునియప్ప, కె.జె.జార్జ్, ఎం.బి.పాటిల్, రామలింగారెడ్డి, సతీశ్ జర్కిహోళి, కృష్ణబైరెగౌడ, యు.టి.ఖాదిర్, ఈశ్వర్ ఖండ్రే, బైరతి సురేశ్, శరణ్ ప్రకాశ్ పాటిల్ తో గవర్నర్ థావర్ చంద్ ప్రమాణం చేయించారు. దీంతో కర్ణాటకలో డీకే శివకుమార్ నేతృత్వంలో నయా సర్కార్ కొలువుదీరింది.

# ఇరాన్‌తో చర్చలు ఆగలేదు

మొదటి పేజీ రువాయి

ఇరాన్‌తో చర్చలు నిలిచిపోయాయంటూ వస్తున్న వార్తలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. ఇవి తప్పుడు ప్రచారాలని కొట్టిపారేశారు. ఇరు దేశాల మధ్య సంప్రదింపులు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని, ఇటీవలి రోజుల్లో కూడా అవి చురుగ్గా జరిగాయని స్పష్టం చేశారు.చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడిందన్న వాదనలు "తప్పుడు, నిరాధారమైనవి" అని ట్రంప్ అభివర్ణించారు. జూన్ 2వ తేదీన కూడా చర్చలు జరిగాయని తెలిపారు. "గత నాలుగు రోజులు, మూడు రోజులు, నిన్న, ఈరోజు... ఇలా ప్రతిరోజూ మా మధ్య చర్చలు జరుగుతూనే ఉన్నాయి," అని ఆయన తన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు. చర్చల్లో పురోగతి ఉన్నప్పటికీ, తుది ఒప్పందంపై అనిశ్చితి కొనసాగుతోందని ఆయన అంగీకరించారు.2025లో అమెరికా, ఇజ్రాయెల్ సైనిక చర్యలు, హార్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ శాంతి చర్చలు ప్రారంభమయ్యాయి. అయితే, లెబనాన్‌లో ఇజ్రాయెల్ కార్యకలాపాల వంటి అంశాలపై అసంతృప్తితో చర్చలు ఆగిపోయాయని ఇరాన్ మీడియాలో కథనాలు వచ్చాయి. ఇరాన్ అణు కార్యక్రమం, ఆంక్షల ఉపసంహరణ, హార్ముజ్ జలసంధిని నౌకా రవాణాకు పూర్తిగా తెరవడం వంటివి ఈ చర్చల్లో కీలక అంశాలుగా ఉన్నాయి.గతంలో చర్చించడానికి ఇష్టపడని అణు అంశాలపై కూడా ఇరాన్ సుముఖత చూపిస్తోందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తెలిపారు. అయితే, ఆమోదయోగ్యమైన ఒప్పందం కుదురుతుందన్న గ్యారెంటీ లేదని ఆయన హెచ్చరించారు.

# ఆరోగ్యమే అసలైన సంపద..

మొదటి పేజీ రువాయి

పరిస్థితిని కల్పిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గుంటూరులో నూతనంగా ఏర్పాటు చేసిన లలితా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న అనంతరం ఆయన ప్రసంగించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. గుంటూరులో 600 పడకలతో, 32 విభాగాలతో అత్యాధునిక వసతులతో లలితా ఆసుపత్రిని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా, దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ఆధునిక ఎమ్ఆర్ఐ స్కాన్‌ను ఇక్కడ ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. "ఒక బ్రాండ్‌కు విలువలు, ప్రజల్లో విశ్వసనీయత తోడైతే దానికి తిరుగుండదు. దశాబ్దాలుగా వైద్య రంగంలో ఉన్న లలితా గ్రూప్ అందుకు నిదర్శనం" అని చంద్రబాబు పేర్కొన్నారు.

ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు

రాష్ట్రంలో ఆరోగ్య రంగాన్ని సమూలంగా మారుస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు 'సంజీవని' ప్రాజెక్టును తీసుకొచ్చాం. దీని ద్వారా ప్రతి ఒక్కరి డిజిటల్ హెల్త్ రికార్డులు నిర్వహిస్తాం. వ్యాధి రాకముందే గుర్తించడం (ప్రిడిక్టివ్), రాకుండా నివారించడం (ప్రివెంటివ్), వచ్చాక నయం చేయడం (క్యూరేటివ్) అనే త్రిముఖ వ్యూహంతో పనిచేస్తాం. ఇంటి వద్దకే వచ్చి 42 రకాల వైద్య పరీక్షలు చేస్తాం" అని వివరించారు. రాష్ట్రంలో 'యూనివర్సల్ హెల్త్ పాలసీ'ని అమలు చేసి, ప్రతి కుటుంబానికి రూ.2.5 లక్షల వరకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు.ఆరోగ్యమే అసలైన సంపద అని, ఆరోగ్యకరమైన పౌరులే సంపన్న దేశాన్ని నిర్మిస్తారని చంద్రబాబు అన్నారు. మంచి ఆహారం, వ్యాయామం, యోగా, ప్రాణాయామం వంటివి జీవనశైలిలో భాగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. "మన వంటిల్లే మన ఫార్మసీ. మనం తినే ఆహారమే మనకు రక్ష. కానీ ఈ రోజుల్లో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారకాల వాడకం పెరిగిపోయింది," అని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నాసిరకం మద్యం విక్రయించి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడారని ఆయన విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని ఆసుపత్రులు కట్టినా, ప్రజల జీవనశైలిలో మార్పు రానంత వరకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం కాదని హితవు పలికారు.

# తప్పుడు ప్రచారాలు చేస్తే.. క్రిమినల్ కేసులు తప్పవు

మొదటి పేజీ రువాయి

వైసీపీ నాయకులకు కేవలం సమస్యలు సృష్టించడం, ప్రభుత్వంపై బురదజల్లడమే అలవాటుగా మారిందని, వారికి సమాధానాలు వినే ఓపిక కూడా లేదంటూ రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులను తీసుకెళ్లి మద్యం దుకాణాల ముందు నిలబెట్టిన ఘనత వారిదేనని ఆక్షేపించారు. కూటమి ప్రభుత్వం ఎంతో పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ పరీక్షలపై ఆ పార్టీ నేతలు చేస్తున్న విమర్శల్లో ఎలాంటి నిజం లేదని, గతంలో వారు గ్రూప్–1 పరీక్షలను ఎంత అధ్వానంగా నిర్వహించారో ప్రజలందరూ చూశారని గుర్తుచేశారు.డీఎస్సీ ప్రక్రియలో అక్రమాలు జరిగాయంటూ కేవలం నోటి మాటలతో తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హోంమంత్రి గట్టిగా హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న ఉపాధ్యాయులలో అత్యధిక శాతం మంది గతంలో టీడీపీ హయాంలోనే నియమితులయ్యారని, గతంలోని సమస్యలన్నింటినీ పరిష్కరించి తాము ఎంతో గౌరవప్రదంగా నియామక పత్రాలను అందించామని స్పష్టం చేశారు.'బ్రిడ్జ్ స్పోర్ట్స్' అంశంపై అవగాహన లేకుండా వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని అనిత ఎద్దేవా చేశారు. బ్రిడ్జ్ స్పోర్ట్స్ అంటే గొడ్డలి పార్టీ నాయకులు గతంలో నడిపించిన జూదం క్లబ్‌లు కావని చురకలు అంటించారు. కేవలం రాజకీయ ఉనికి కోసమే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

# జూన్ 5 నుంచి కొత్త రేట్లు!

మొదటి పేజీ రువాయి

తెలంగాణలో భూములు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లు మరింత భారం కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా సవరించిన భూముల మార్కెట్ విలువలను జూన్ 5వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి బుధవారం ప్రకటించారు. వాస్తవ మార్కెట్ పరిస్థితులకు, ప్రభుత్వ విలువలకూ మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు.ఈ సవరణ కోసం ప్రభుత్వం శాస్త్రీయమైన, పారదర్శకమైన విధానాన్ని అనుసరించినట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో క్షేత్రస్థాయి అధ్యయనాలు, రిజిస్ట్రేషన్ల డేటా విశ్లేషణ, నిపుణుల కమిటీల సూచనలను పరిగణనలోకి తీసుకున్నారు. ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పారిశ్రామిక వృద్ధి, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని డిమాండ్‌ను ఆధారంగా చేసుకుని కొత్త విలువలను నిర్ధారించారు.కొత్త విధానం ప్రకారం, కొన్ని ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లలోని అన్ని అంతస్తులకు ఒకే రకమైన విలువను వర్తింపజేయనున్నారు. ఇప్పటికే అధిక విలువలు ఉన్నచోట్ల ఎలాంటి పెంపు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ సహా కీలక ప్రాంతాల్లో వ్యవసాయ భూములు, నివాస ప్లాట్లు, ఫ్లాట్లకు కొత్త కనీస ధరలను నిర్ణయించారు.ఈ సవరణ ఫలితంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగనున్నాయి. ఇది ఆస్తి కొనుగోలుదారులపై, పెట్టుబడిదారులపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే, ప్రజలపై అనవసర భారం పడకుండా హేతుబద్ధంగానే ఈ మార్పులు చేశామని, దీనివల్ల ప్రభుత్వ ఆదాయం పెరగడంతో పాటు లావాదేవీలలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

# కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం నుండి డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టండి

**సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి ని కోరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**అతి త్వరలో సంయుక్త సమావేశం**

**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03 :** నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలన్న లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో కొల్లూరు, ఉస్మాన్ నగర్, నాగులపల్లి ప్రాంతాలలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి కేటాయించడం జరిగిందని.. గత కొంతకాలంగా అసాంఘిక శక్తులకు, మత్తు పదార్థాలకు కేంద్రాలుగా తయారవుతున్నాయని.. వెంటనే చర్యలు చేపట్టడంతో పాటు మత్తు పదార్థాల వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డికి పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.బుధవారం గచ్చిబౌలిలోని సిపి కార్యాలయంలో కమిషనర్ రమేష్ రెడ్డిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. ప్రధానంగా నియోజకవర్గ పరిధిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గల డివిజన్లలో గత కొంతకాలంగా మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధానంగా యువతతో పాటు విద్యార్థులు, పేద, మధ్యతరగతి ప్రజలు మత్తు పదార్థాలకు బానిసై.. అనారోగ్యానికి గురై ఆర్థికంగా చితికిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లల్లో అత్యధిక శాతం అత్యంత నిరుపేదలు జీవనం కొనసాగిస్తున్నారని.. మత్తు పదార్థాల వినియోగం మూలంగా కుటుంబాలు రోడ్డున పడటంతో శాంతిభద్రతలు అదుపు తప్పుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంలో వెంటనే చర్యలు చేపట్టకపోతే తీవ్ర పరిణామాలు ఉత్పన్నమయ్య పరిస్థితి ఏర్పడబోతున్నాయని సిపి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు



సానుకూలంగా స్పందించిన సిపి రమేష్ రెడ్డి.. అతి త్వరలో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయడంతో పాటు డ్రగ్స్ వాడకం మూలంగా ఎదురయ్యే పరిణామాలను ప్రజలకు స్వయంగా వివరించడం జరుగుతుందని తెలిపారు. నిరంతరం నిఘా పెట్టడంతో పాటు దుష్పరిణామాలపై వివిధ మాధ్యమాల ద్వారా అవగాహన కల్పిస్తామని తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారుడు కూతురు లింగం సన్మానం

**కూతురు లింగం ను ఘనంగా సన్మానించిన మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ ఉపసర్పంచ్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కూతురు లింగం ను ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్ సన్మానించి అభినందించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని ఉద్యమకారుడు కూతురు లింగం రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో చేసిన సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, మహిళా అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, మదర్ డైరీ డైరెక్టర్ సంధిల భాస్కర్ గౌడ్, మాజీ డైరెక్టర్ చింతల పూరి వెంకట్ రామ్ రెడ్డి, మేక వెంకటేశ్వర్లు రెడ్డి, జలసాధన సమితి కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్, మాజీ ఎంపీపీ గోపగాని బాలమణి యాదగిరి గౌడ్, మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, రాజపేట పట్టణ అధ్యక్షులు బెడిద వీరేశం, రామిండ్ల నరేందర్, డీలర్ పోచయ్య, ములుగు సోమలింగం, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నర్సింలు, రఘునాథపురం సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి చామకూర గోపాల్, దగ్గుల విష్ణు, బిక్షపతి, చెల్మిడి వెంకటేష్,, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మర్ల నాగరాజు, బాలకృష్ణ చంద్రయ్య తదితరులు ఉన్నారు

# సర్కారు బడి చదువులమ్మ ఒడి.. నాణ్యమైన బోధనతో ఉత్తమ ఫలితాలు....

**రాజపేట మండలం రఘునాథపురం జెడ్పీహెచ్ఎస్‌కు మరో అరుదైన గుర్తింపు**

**మరోసారి బాసర ట్రిపుల్ ఐటీలో ఐదుగురు విద్యార్థులు ఎంపిక**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలంలోని రఘునాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) మరోసారి తన ప్రతిభను చాటుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నాణ్యమైన విద్య అందితే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని నిరూపిస్తూ, ఈ విద్యా సంవత్సరంలో ఐదుగురు విద్యార్థులు ప్రతిష్టాత్మక బాసర ట్రిపుల్ ఐటీ (ఆర్జీయూకేటీ)లో ప్రవేశానికి ఎంపికయ్యారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వ పాఠశాలలపై పెరుగుతున్న విశ్వాసం**

ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలంటే నిర్లక్ష్య భావన ఉండేది. కానీ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల, అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులకు అందుతున్న ప్రోత్సాహంతో పరిస్థితులు పూర్తిగా మారాయి. రఘునాథపురం జెడ్పీహెచ్ఎస్ కూడా ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది.పాఠశాలలో విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాల బోధన మాత్రమే కాకుండా పోటీ పరీక్షలపై ప్రత్యేక శిక్షణ, వ్యక్తిత్వ వికాసం, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తున్నారు.

**ట్రిపుల్ ఐటీలో ఐదుగురికి అవకాశం**

బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశం సాధించడం గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఒక గొప్ప అవకాశంగా భావిస్తారు. ఈ నేపథ్యంలో రఘునాథపురం పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ప్రవేశానికి ఎంపిక కావడం పాఠశాల చరిత్రలో మరో విజయంగా నిలిచింది. క్రమశిక్షణతో చదువుతూ ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో ముందుకు సాగిన విద్యార్థులు ఈ ఘనత సాధించారు.

**ఉపాధ్యాయుల అంకితభావమే విజయ రహస్యం**

విద్యార్థుల విజయంలో ఉపాధ్యాయుల కృషి కీలక పాత్ర పోషించింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణలో ఉపాధ్యాయ బృందం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించింది. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వారి బలహీనతలను గుర్తించి తగిన సూచనలు అందించింది.

**తల్లిదండ్రుల సహకారం అభినందనీయం**

విద్యార్థుల విజయానికి తల్లిదండ్రుల సహకారం కూడా ఎంతో దోహదపడింది. పిల్లల చదువుపై నిరంతరం శ్రద్ధ చూపుతూ ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకోవడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పాఠశాల వర్గాలు పేర్కొంటున్నాయి.




**గ్రామానికి గర్వకారణం**

ఒకే పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందడం గ్రామానికి గర్వకారణంగా మారింది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోరని మరోసారి రుజువైంది. ఈ విజయం రానున్న తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు.

**అభినందనల వెల్లువ**

ట్రిపుల్ ఐటీలో ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందితే అద్భుత ఫలితాలు సాధించవచ్చని రఘునాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరోసారి నిరూపించింది.

# రాజపేట మండల టీయూజేఏసి నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం....




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** టీయూజేఏసి రాజపేట మండలం మహాసభ ఆధ్వర్యంలో టియుజెఏసి మండల అధ్యక్షునిగా ఠాకూర్ ప్రమోద్ సింగ్ ఏకగ్రీవంగా బుధవారం ఎన్నుకున్నారు. మహిళ అధ్యక్షురాలిగా ఎడ్ల బాలలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శిగా మారోజు కుమారస్వామి, రామిండ్ల నరేందర్ ని, ఆడెపు రమాదేవిని కోశాధికారి బిల్ల శీను, ఉపాధ్యక్షులుగా చింతల దాసు, కార్యదర్శి ఎడ్ల సత్తిరెడ్డి,సోషల్ మీడియా కన్వీనర్ కొన్నే శివశంకర్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు తమ్మల శోభారాణి, జిల్లా అధ్యక్షులు గాజుల యాదగిరి, యాదాద్రి జిల్లా బిజెపి అధ్యక్షులు ఊట్కూరు అశోక్ గౌడ్, బాల్ రెడ్డి, బోళ్ల రాఘవ రెడ్డి, రాజిరెడ్డి, నరసింహులు, రామిళ్ళ సుధాకర్ రెడ్డి, కొన్ని శివశంకర్, చంద్రమౌళి, సుగుణమ్మ,అనిత, విజయ, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

# బొందుగుల గ్రామ అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తా... ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**నా జన్మదినం సందర్భంగా పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేయాలి... అభిమానులకు, నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పిలుపు...**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలంలోని బొందుగుల గ్రామ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు అందజేయనున్నట్లు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు. బుధవారం రోజు యాదగిరిగుట్టలోని ఆయన స్వగృహంలో బొందుగుల గ్రామ సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య కలిసి గ్రామ అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించాలని కోరగా ఆయన స్పందించారు. గ్రామంలో ప్రజలకు, గ్రామ అభివృద్ధికి అవసరమైన పనుల ప్రతిపాదన వెంటనే అందజేయాలని ఈ సందర్భంగా సర్పంచ్ కు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు సర్పంచ్ పయ్యావుల ఎల్లయ్య ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు.

పుట్టినరోజు సందర్భంగా నోటు పుస్తకాలు పెన్నులు అందజేత ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య జన్మదినం పురస్కరించుకొని బొందుగుల గ్రామ సర్పంచి పయ్యావుల ఎల్లయ్య నోటు పుస్తకాలు, పెన్నులు బీర్ల ఐలయ్యకు అందజేసి ముందస్తుగా జన్మదిన శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు చెబుతూ జన్మదినం సందర్భంగా పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు అందజేయాలని, తన వద్దకు శాలువలు పుష్పగుచ్చాలు తీసుకురావద్దని నోటు పుస్తకాలు పెన్నులు ఇవ్వాలని అభిమానులకు, నాయకులకు, కార్యకర్తలకు బీర్ల ఐలయ్య పిలుపునిచ్చారు

# ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలు




**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03 :**
సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో అమీన్పూర్‌లోని దినేష్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు ఏర్పాటు చేసి, వారి సమక్షంలో హరీష్ అన్న జన్మదిన కేక్‌ను కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.అనంతరం పటాన్ చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ ఆధ్వర్యంలో శివనగర్‌లోని శిరీష చారిటబుల్ ట్రస్ట్‌లో చిన్నారుల మధ్య జన్మదిన వేడుకలు జరిపి, కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ రెండు కార్యక్రమాలలో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని, వృద్ధులు, చిన్నారులతో కలిసి జన్మదిన వేడుకల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. సేవే లక్ష్యంగా, ప్రజలే కుటుంబంగా ముందుకు సాగుతున్న హరీష్ అన్న కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

# సభ స్థలాన్ని పరిశీలించిన టీఆర్పీ నాయకులు....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) ఆధ్వర్యంలో భువనగిరి జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీ మైదానంలో జూలై 5వ తేదీన నిర్వహించనున్న "రాజ్యాధికార సమరభేరి" బహిరంగ సభకు సంబంధించి సభ స్థలాన్ని పార్టీ ముఖ్య నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సభ నిర్వహణ అధ్యక్షులు ఉ పార్టీ ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ మరియు వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రజినీ కుమార్ యాదవ్ సభ ఏర్పాట్లు, వేదిక నిర్మాణం, ప్రజల రాకపోకల సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. సభను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపట్టాలని నాయకులు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనే ఈ సభను చారిత్రాత్మకంగా నిలపాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అలాగే ప్రతి కార్యకర్త సభ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గంగాధర్ లింగాల, వేములవాడ మదన్ మోహన్ చారి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజ, ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్, క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ బంధారపు నర్సయ్య, కోశాధికారి కొక్కలకొండ మనోజ్, మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నీరజ గౌడ్, రాష్ట్ర కార్యదర్శులు ఆర్.భవన్ వెంకటేష్, నగేష్ ముదిరాజ్, రమేష్ యాదవ్,కొమ్ముల ప్రవీణ్ రాజ్, ఆకుల హనుమాన్లు, శివవీర్ రెడ్డి, పసల ప్రసన్న, అఖిల్ పాషా, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ మనోజ్ ఆకుల, యూత్ అధ్యక్షులు బొడ్డుపల్లి చంద్ర శేఖర్, కార్మిక విభాగం అధ్యక్షుడు సంకూరి శ్రీనివాస్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఎంఎల్ రాజు, మైనారిటీ విభాగం అధ్యక్షులు సల్మాన్, ఆఫీస్ కో ఆర్డినేటర్ లింగం యాదవ్, రాష్ట్ర నాయకులు పిట్టల శంకర్, సుతారపు రంగన్న తో పాటు 33 జిల్లాల అధ్యక్షులు,13 కమిటీల కన్వీనర్లు సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.




# సిసి రోడ్డు పనులు ప్రారంభం...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం దూదివెంకటాపురం గ్రామంలోని 5వ వార్డ్ లో బుధవారం సర్పంచి నడిమింటి నరేష్ సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, వార్డ్ సభ్యులు, కాంట్రాక్టర్ గొడిశెల నగేష్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు

# మల్లెపల్లి సోమిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు





**రామచంద్రపురం, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03 :** తెల్లాపూర్ మాజీ సర్పంచ్, బి ఆర్ ఎస్ సీనియర్ నాయకులు మల్లెపల్లి సోమిరెడ్డి ఆధ్వర్యంలో అనాధ పిల్లల మధ్య మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనాధ పిల్లల మధ్య కేక్ కటింగ్ చేసి,బట్టల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లెపల్లి సోమిరెడ్డి మాట్లాడుతూ తన గురు సమానులు, ఆరాధ్య దైవం తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలు అనాధ పిల్లల మధ్య జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని హరీష్ రావు ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆయన కోరుకున్నారు.

# ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**జిన్నారం, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03 :** పాతికేళ్ల తర్వాత తమ స్నేహితులు, చదువు చెప్పిన గురువులను చూసి పూర్వ విద్యార్థులు మురిసిపోయారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ సందడిగా గడిపారు. జిన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో 2000-2001 సంవత్సరం (సిల్వర్‌జూబ్లీ) కార్యక్రమాన్ని మంగళవారం మాధారం శివారు లో ఓ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ గురువులను సన్మానించి వారి ఆశీర్వాదాలను పొందారు,ఈ సందర్భంగా ఉన్నత స్థానాలకు ఎదిగిన తమ పూర్వ విద్యార్థులను చూసి గురువులు ఆనందించారు. జీవితంలో ఇంకా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వదించారు. తమపై విద్యార్థుల ప్రేమాభినాలు ఎల్లప్పుడు ఉండాలని కోరుకున్నారు. విద్యార్థినీ విద్యార్థులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యార్థి దశలో గురువులతో మెలిగిన సందర్భాలను తెలియజేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు అనంతరెడ్డి గణితశాస్త్రం ఉపాధ్యాయులు, యాదగిరి ఆంగ్ల ఉపాధ్యాయులు, బిక్షపతి సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు, కృష్ణారెడ్డి ఆంగ్ల ఉపాధ్యాయులు శర్మ, తెలుగు ఉపాధ్యాయలను శాలువతో ఘనంగా సన్మానించి మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు 80 మంది వరకు పాల్గొన్నారు.






# తెలంగాణ ఉద్యమకారులకు హామీలు అమలు చేయాలి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటి గ్రామంలో తెలంగాణ మలిదశ ఉద్యమంలో జైలుకు వెళ్లిన ఉద్యమకారులను సన్మానించారు. కుమురం భీమ్ జిల్లా ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ అజ్మీర బాబూరావు ఆధ్వర్యంలో అజ్మీర బాబూరావు, బోగే ఉపేందర్, కోట రాజయ్య, దుర్గం రవీందర్, సొగల వామన్‌లను సత్కరించారు. ఈ సందర్భంగా అజ్మీర బాబూరావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచివేసేందుకు అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించిందని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు పెన్షన్, భూమి, ఇందిరమ్మ ఇళ్లు అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దుర్గం తిరుపతి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పంబాల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# జన భవిత ట్రస్ట్ యోగ కేంద్రం వార్షికోత్సవం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం మినీ స్టేడియంలో జన భవిత చారిటబుల్ ట్రస్ట్ యోగ ధ్యాన శిక్షణ కేంద్రం వార్షికోత్సవం జరిగింది. భగవద్గీత మహాయజ్ఞం, మృత్యుంజయ హోమం నిర్వహించారు. యోగ సాధకులు తమ అనుభవాలు పంచుకున్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు డోంగ్రే సురేష్ మాట్లాడుతూ గత ఏడాది ఒక్కరోజు కూడా తప్పకుండా యోగ తరగతులు నిర్వహించిన యోగ గురువులు దాసరి వినోద్ కుమార్, దౌలత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ విద్య, ఆరోగ్య, ఆర్థిక సాధికారత కోసం పనిచేస్తుందని, యోగతో పాటు స్పోకెన్ ఇంగ్లీష్, పోటీ పరీక్షల కోచింగ్, ఉచిత వైద్య శిబిరాలు, పాఠశాల-కళాశాలల్లో మోటివేషనల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైతులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# బడి బాట కార్యక్రమంతో ఇంటింటికీ విద్యా ప్రచారం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని వట్టివాగు, యపాల్‌పట్టి గ్రామాల్లో ఆచార్య జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటా బడి బాట కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ ఆత్రం ఈశ్వరి దీనకర్ ఆధ్వర్యంలో ఎస్‌సీఆర్‌పీ రాథోడ్ రవీందర్, ఉపాధ్యాయుడు కుమరం మాధవరావ్ ఈ కార్యక్రమం నిర్వహించారు. బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులు గ్రామాన్ని మ్యాపింగ్ చేసి ప్రతి ఇంటికి వెళ్లి విద్యార్థులను పాఠశాలకు తీసుకొస్తారని, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలను కూడా నమోదు చేస్తారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. గిరిజన విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

# మృతురాలి కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ బియ్యం పంపిణీ...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం రేణికుంట గ్రామంలో ఇటీవల మరణించిన సుంకరపల్లి లక్ష్మీ కుటుంబానికి బుధవారం రోజు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత ద్వారా 50 కిలోల బియ్యం కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరే మల్లయ్య, బొద్దుల స్వామి, కొండ అశోక్, కొండ మనోహర్, బొమ్మ జనార్ధన్, గ్రామస్తులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# తీవ్రమైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ సమస్య త్రాగే నీరు, బోరునీళ్లు కలుషితం; ప్రజలు ఆందోళన



**రామచంద్రపురం, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03 :** రామచంద్రపురం 268, భారతినగర్ 269 డివిజన్లలోని ప్రతి కాలనీలో తీవ్ర అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ సమస్యకు కారణంగా మంచినీటితరుబాట్లు మరియు భూగర్భజలాలు కలుషితమవుతున్నాయి. అనేక మ్యాన్‌హోల్ కవర్స్ ధ్వంసం అయ్యాయి. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని స్థానిక నేత ఐలేష్ డిప్యూటీ జనరల్ మేనేజర్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్బి (అమీన్పూర్/రామచంద్రపురం) ను కలసి విజ్ఞప్తి చేశారు. సమస్యపై వెంటనే తక్షణ చర్యలు తీసుకుని, కొత్త డ్రైనేజ్ లైన్లు, మంజినీటి సరఫరా పైపుల పునరుద్ధరణ మరియు మ్యాన్‌హోల్ కవర్స్ మార్పు చేయాలని కోరారు. నిర్లక్ష్యమైతే ప్రజలతో కలిసి ప్రతిఘటన బహుకాకుందని హెచ్చరించారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ స్పందిస్తూ త్వరలో స్థల పర్యటన చేసి పరిష్కారం కలిగిస్తామని తెలిపారు.

# మహిళపై అత్యాచారం, దాడి ఆరోపణలు.. పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు



**హైదరాబాద్ పల్స్, జూన్ 03, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** డోర్నకల్ మండలం దుబ్బతండాకు చెందిన కోర్ర కమల అనే మహిళ తనపై అత్యాచారం జరిగిందని, అనంతరం వేధింపులు, దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ పోలీసులను బుధవారం ఆశ్రయించింది. బాదితులు తెలిపిన వివరాల మేరకు అజ్మీర పర్తి, అజ్మీర శంకర్, అజ్మీర అనితా, అజ్మీర స్రవంతిలపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. బాధితురాలు అందించిన ఫిర్యాదు వివరాల ప్రకారం,అజ్మీర పర్తి తనపై బలవంతంగా అత్యాచారానికి పాల్పడ్డాడని ఆరోపించింది. ఈ విషయమై నిలదీయడంతో పాటు న్యాయం కోరేందుకు ప్రయత్నించిన నేపథ్యంలో తనపై కక్ష పెంచుకున్నారని పేర్కొంది. ఈ క్రమంలో నిందితులు రాత్రి సమయంలో తన ఇంటి వద్దకు వచ్చి గొడవకు దిగడంతో పాటు దుర్భాషలాడి భౌతిక దాడికి పాల్పడ్డారని ఫిర్యాదులో వివరించింది. దాడి సమయంలో తనను కర్రలతో కొట్టారని, జుట్టు పట్టుకుని లాగారని, అడ్డుకునేందుకు ప్రయత్నించిన వారిని కూడా బెదిరించారని ఆరోపించింది. తన కేకలు విని సమీపంలో ఉన్న గ్రామస్తులు అక్కడికి చేరుకోవడంతో పరిస్థితి అదుపులోకి వచ్చిందని తెలిపింది. తనకు జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోర్ర కమల పోలీసులను కోరింది. ప్రస్తుతం బాధితురాలి ఫిర్యాదును పోలీసులు స్వీకరించినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన ఆరోపణలపై విచారణ అనంతరం తదుపరి చర్యలు ఉండనున్నాయి.

## సంగారెడ్డి జిల్లా నూతన డీఈఓగా ఆర్. రోహిణి బాధ్యతల స్వీకరణ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, సంగారెడ్డి ప్రతినిధి:**
సంగారెడ్డి జిల్లా నూతన జిల్లా విద్యాశాఖాధికారిగా (డీఈఓ) ఆర్. రోహిణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై సంగారెడ్డి జిల్లాకు వచ్చి అధికారికంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు డీఈఓగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు బదిలీపై రంగారెడ్డి జిల్లాకు వెళ్లగా, ఆయన స్థానంలో ఆర్. రోహిణి నియమితులయ్యారు. విద్యా రంగంలో తనకున్న అనుభవంతో జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా విద్యార్థులకు చేరవేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆమె రాకతో జిల్లాలో విద్యా రంగం మరింత అభివృద్ధి చెందుతుందని అధికారులు, ఉపాధ్యాయ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

## అనుమతి పేరుతో అడ్డగోలు మట్టి రవాణా.....

**రాజపేట మీదుగా రవాణా అవుతున్న మట్టి వాహనాలు**
**అధికారులు స్పందించకపోతే మరో వారం రోజులు కొనసాగింపు......**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
రాజపేట మండలం మీదుగా అక్రమ మట్టి రవాణా గత 15 రోజులుగా యదేచ్ఛగా సాగుతోంది. రాత్రి పగలు తేడా లేకుండా 24 గంటలు ఈ వాహనాలు నడుస్తూనే ఉన్నాయి. అనుమతి పేరుతో అడ్డగోలు రవాణా చేస్తూ అదేమిటి అని అడిగిన వారిపై నిందలు బెదిరింపులు సంబంధిత కాంట్రాక్టర్ నుండి వస్తున్నాయి. గత నెల 20వ తేదీ నుండి ఈ నెల 9వ తేదీ వరకు 20 రోజుల పాటు ఆలేరు మండలం కొలనుపాక పట్టా భూమి నుండి మట్టి రవాణా అనుమతిస్తూ మైన్స్ శాఖ చేసిన ఉత్తర్వుల ప్రకారం కాకుండా లక్షలు రూపాయలు గడించాలని సంబంధిత అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తూ ఇష్టం వచ్చిన ప్రదేశాలకు ఇటుక బట్టీలకు మట్టి రవాణా సాగుతోంది. ఈ విషయంపై సంబంధిత అధికారులు చర్య తీసుకోవాలని రాజపేట మండల రైతులు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

## నిరుపేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, భద్రాద్రి కొత్తగూడెం :**
చర్ల మండలం కలివేరు, పెద్ద ముసిలేరు. గ్రామాల్లో లబ్ధిదారులకు డబల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాల కార్యక్రమం నిర్వహించిన అధికారులు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం. వెంకట్రావు పాల్గొని నిరుపేద లబ్ధిదారులైన 48 మందికి ఇల్ల పట్టాలు సర్పంచ్ తెల్లం. లక్ష్మణ్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం కొయ్యూరు గ్రామంలో 20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఇందిరమ్మ ఇల్ల పథకంలో రేకుల షెడ్డు ఉన్నవారికి కూడా ఇందిరమ్మ ఇల్ల పథకం కింద ఇల్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. ఎవరు ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎం. శ్రీనివాస్, ఎంపీడీవో ఈదయ్య, సర్పంచ్ కాపుల. శారద, ఉప సర్పంచ్ కునారపు. సతీష్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు, పి.ఏ.సి.ఎస్ చైర్మన్ పరుచూరి. రవి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇర్పా. శ్రీనివాసరావు, ఇందల. బుచ్చిబాబు, పోలిన. లంకరాజు, పోట్రు, బ్రహ్మానందరెడ్డి, చీమలమర్రి, మురళి గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను భారీ విజయవంతం చేసిన ప్రజానీకానికి హృదయపూర్వక ధన్యవాదాలు

### సరండి గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ కొట్రాంగే మేంగజి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కొత్తగూడ–కొరారి గ్రామంలో నిర్వహించిన సామూహిక గృహప్రవేశ కార్యక్రమం, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రారంభోత్సవం, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్న భారీ బహిరంగ సభను అపూర్వ విజయవంతం చేసిన జిల్లా ప్రజలకు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత, రైతులు, కార్మికులు, వివిధ వర్గాల ప్రజలు మరియు అధికార యంత్రాంగానికి వాంకిడి మండలం సరండి గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ కొట్రాంగే మేంగజి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విడుదల చేసిన మీడియా ప్రకటనలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనకు ప్రజలు స్వచ్ఛందంగా భారీ సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయడం కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతి ఇంటికీ చేరుతున్నందునే ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారని తెలిపారు. ప్రత్యేకంగా పేదల గృహ కలను సాకారం చేసే ఇందిరమ్మ ఇళ్ల పథకం రాష్ట్ర చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. స్వంత ఇంటి కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశం వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోందని అన్నారు. సామూహిక గృహప్రవేశ కార్యక్రమం ద్వారా వేలాది కుటుంబాల్లో ఆనందాన్ని నింపిన ముఖ్యమంత్రి నాయకత్వాన్ని ప్రజలు హర్షిస్తున్నారని చెప్పారు. జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు, విద్య, వైద్యం, సాగునీరు, ఉపాధి అవకాశాల కల్పన వంటి రంగాల్లో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రతి వర్గం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉందని అన్నారు. సభ విజయవంతం కావడానికి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు,సామాన్య కార్యకర్తలు సమన్వయంతో పనిచేశారని, వారి కృషి అభినందనీయమని పేర్కొన్నారు. శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, సభ నిర్వహణలో అహర్నిశలు శ్రమించిన పోలీసు శాఖ, రెవెన్యూ శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భారీ ఎండలను సైతం లెక్కచేయకుండా సభకు హాజరై కాంగ్రెస్ పార్టీకి, ముఖ్యమంత్రి నాయకత్వానికి మద్దతు తెలిపిన ప్రజలకు మరోసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు మరింత బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కూడా ప్రజల సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, మహిళా సాధికారత, రైతు సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని కొట్రాంగే మేంగజి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికీ మరోసారి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజల ఆశీర్వాదాలతో అభివృద్ధి పథంలో ముందుకు సాగుతామని అన్నారు.



### మత్స్యకారుల ఉపాధిపై విష దాడి..

# రెండు క్వింటాళ్ల చేపల మృతి



**హైదరాబాద్ పల్స్, జూన్ 03, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:**
డోర్నకల్ మండలం పెరుమండ్ల సంకీస గ్రామంలో చేపల పెంపకాన్ని లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని వ్యక్తులు విష ప్రయోగానికి పాల్పడిన ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనలో సుమారు రెండు క్వింటాళ్ల చేపలు మృతి చెందడంతో మత్స్యకారులకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది. గ్రామంలోని రెడ్డి చెరువులో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి పెట్టి ప్రత్యేకంగా బావి తవ్వించి చేపల పెంపకం చేపడుతున్నారు. బుధవారం ఉదయం చేపలకు ఆహారం వేయడానికి వెళ్లిన మత్స్యకారులు బావిలో పెద్ద సంఖ్యలో చేపలు మృతి చెంది నీటిపై తేలియాడుతుండటాన్ని గుర్తించి దిగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న సంఘ సభ్యులు, అక్కడికి చేరుకుని పరిశీలించారు. బావిలో విషపదార్థాలు కలపడం వల్లే చేపలు మృతి చెందినట్లు బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నో నెలలుగా కష్టపడి పెంచిన చేపలు ఒక్కసారిగా మృతి చెందడంతో తమ జీవనాధారంపై తీవ్ర ప్రభావం పడిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెట్టుబడుల కోసం అప్పులు చేసిన నేపథ్యంలో ఈ నష్టం మరింత భారంగా మారిందన్నారు. సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంకీస, కాంపెల్లి గ్రామల ప్రధాన రహదారి పై మత్స్యకారులు, ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. చేపల పెంపక కేంద్రంలో విష ప్రయోగానికి పాల్పడిన నిందితులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితులకు ప్రభుత్వం తక్షణ నష్టపరిహారం అందించాలని కోరారు ఉపాధి కోసం శ్రమిస్తున్న మత్స్యకారులపై ఇలాంటి దుర్మార్గపు చర్యలు సమాజానికి మంచివి కావని పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు, సంబంధిత శాఖ అధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలికితీయాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చేపల పెంపక కేంద్రాల వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. నిరసన కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కాపారబోయిన నరసయ్య, కార్యదర్శి దేశబైనా రమేష్, కందుల శంకర్, కందుల శ్రీనివాస్, మర్రి నాగేశ్వరావు, దేశబైనా నర్సింగ్, దేశబైనా శ్యామ్, దేశబోయిన శ్రీధర్, దేశబోయిన సురేష్, నక్క అప్పయ్య, నక్క వీరస్వామి, నక్క వీరబాబు, మింగు రాజ్ కమల్, కొల్లు రాంబాబు, పిల్లి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.



### మెడికల్ బోర్డు తక్షణమే నిర్వహించి

# కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి

### టీబీజీకేఎస్ ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపుకృష్ణ ఆధ్వర్యంలో సింగరేణి అధికారులకు మెమొరండాలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెం, కార్పొరేట్ ఏరియాలలో అన్ని గనులు మేనేజర్లకు డిపార్ట్మెంట్స్ హెచ్ ఓ డి లకు మెమొరండాలు కాపుకృష్ణ టీబీజీకేఎస్ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది. వారి ద్వారా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కి మెమో రాండం పంపాలని కోరడంజరిగింది. ఈ సందర్భంగా కాపు కృష్ణ మాట్లాడుతూ మెడికల్ బోర్డు తక్షణమే నిర్వహించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి. కొత్త గనులను సాధిస్తూ,వాటిలో సింగరేణి ఉద్యోగులతో నడిపిస్తూ సంక్షేమ చర్యలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మా మనవి ఏమనగా సింగరేణి బొగ్గు గని కార్మికులు దుమ్ము ధూళిలో పనిచేస్తూ తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. అనారోగ్య కారణాలుతో రోగాలతో) డ్యూటీలకు హాజరు కాకపోవడం వలన జీతం రాక, అప్పుల పాలవుతున్నారు. దేశంలోని ఇతర పరిశ్రమలకు భిన్నంగా బొగ్గు గని కార్మికులు పనిచేస్తారు. పని స్థలాలు కాలుష్యం, ప్రమాదాలతో కూడుకుని ఉన్న ప్రతి కార్మికులు తమ ప్రాణాల్ని పణంగా పెట్టి పని చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు కుట్రపూరితంగా వారసత్వ ఉద్యోగాలను రద్దు చేసి, సింగరేణి కార్మిక కుటుంబాలకు తీరని ద్రోహం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, కెసిఆర్ తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, సాహసోపేతంగా తిరిగి కారుణ్య నియామకాల పేరిట కార్మికుడి వారసులకు ఉద్యోగాలను పునరుద్ధరించారు. గత అసెంబ్లీ, సింగరేణి గుర్తింపు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయకుండా కార్మికులను మోసగిస్తున్నారు. సింగరేణి కార్మికులకు ప్రతి నెలలో రెండు మెడికల్ బోర్డులు నిర్వహించి, అధిక సంఖ్యలో కారుణ్య ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఆచరణలో గడిచిన 15 నెలలుగా ఒక్క మెడికల్ బోర్డు నిర్వహించలేదువేలాది మంది కార్మికులు తమ వారసులకు ఉద్యోగాల కోసం కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కారుణ్య నియామకాలలో అవినీతి జరిగిందని అసెంబ్లీలో ప్రకటించారు. ఇది అత్యంత కుట్రపూరితమైన చర్య. విజిలెన్స్ విచారణ పేరిట కార్మికులను వేధింపులకు, భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీన్ని అడ్డుకోవడంలో కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు, మంత్రులు, సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలు ఘోరంగా విఫలమయ్యాయి. సింగరేణి సంస్థ పరిరక్షణకు, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని టీబీజీకేఎస్ డిమాండ్ చేస్తున్నారు. డిమాండ్లు ప్రతినెల రెండు మెడికల్ బోర్డులను నిరంతరాయంగా నిర్వహించాలనీ ఉద్యోగ నియామకాల కోసం ఎదురుచూస్తున్న వారికి తక్షణమే నియామక ఉత్తర్వులు ఇవ్వాలని విజిలెన్స్ మారుపేర్ల సమస్యను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చెల్లించవలసిన 54 వేల కోట్ల రూపాయల బకాయిలను తక్షణమే రాబట్టాలి. కార్మికులు పెర్క్స్ పైన చెల్లిస్తున్న ఇన్కమ్ టాక్స్ డబ్బులను యాజమాన్యం తిరిగి కార్మికులకు చెల్లించాలి. గైర్హాజర్ పేరిట కార్మికులను డిస్మిస్ చేయరాదు. కొందరికి జారి చేసిన డిస్మిస్ ఉత్తర్వులు ఉపసంహరించుకొని, కార్మికులను విధులకు అనుమతించాలి. కొత్త బొగ్గు గనుల కేటాయింపు కు కేంద్ర ప్రభుత్వం తో సంప్రదింపులు జరపాలి. ఉన్న గనులను సింగరేణి కార్మికులతో నడిపించాలి. ఈయొక్క కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ గడప రాజయ్య, కార్పొరేట్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ తుమ్మ శ్రీనివాస్, సెంట్రల్ కమిటీ మెంబర్లు కాగితపు విజయ్ కుమార్, బూర్గుల రవికుమార్, ఎంటెక్ మహేందర్, కంచర్ల శ్రీనివాస్, ఫిట్ సెక్రటరీలు బండారి రాజ్ కుమార్, నమిల్ల వెంకటేశ్వర్లు, రఘువీర్, ఆంజనేయులు, తిరుపతి, సూరజ్, సూర్యనారాయణ, జైపాల్, కుమార్, శ్రీకాంత్, చంద్రశేఖర్, రాజు, రాంబాబు, సంతోష్, రవి వర్మ, తదితరులు పాల్గొన్నారు.



# మమతకు మరో షాక్.. టీఎంసీ రెబల్‌కు ప్రతిపక్ష నేత హోదా!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, కలకత్తా :** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు నిలువునా చీలిపోయే ప్రమాదంలో పడింది. పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీ నేతృత్వంలో దాదాపు 59 మంది రెబెల్ ఎమ్మెల్యేలు ఒక గ్రూపుగా ఏర్పడి, మమతా బెనర్జీ నాయకత్వానికి గట్టి సవాల్ విసిరారు. తృణమూల్ కాంగ్రెస్‌కు మొత్తం 80 మంది ఎమ్మెల్యేలు ఉండగా, అందులో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ అంటే దాదాపు 59 మంది రెబెల్ ఎమ్మెల్యేలు బుధవారం కోల్‌కతాలోని అసెంబ్లీకి తరలివచ్చారు. తామంతా రితబ్రత బెనర్జీని లెజిస్లేటివ్ పార్టీ లీడర్‌గా ఎన్నుకున్నామని, ఆయన్నే అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా గుర్తించాలని కోరుతూ స్పీకర్ రతీంద్రనాథ్ బోస్‌కు మద్దతు లేఖలను సమర్పించారు. మరోవైపు మమతా బెనర్జీ పక్షం సీనియర్ నేత సొవన్దేబ్ చట్టోపాధ్యాయను ప్రతిపక్ష నేతగా నియమించాలని ప్రతిపాదించింది. అయితే, అంతకుముందు పార్టీ సమర్పించిన లేఖలో తమ సంతకాలను ఫోర్జరీ చేశారంటూ రితబ్రత బెనర్జీ, సందీపన్ సాహా వంటి నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ వివాదం మొదలైంది. ఆ ఫిర్యాదు చేసిన కొద్ది నిమిషాల్లోనే వారిని టీఎంసీ బహిష్కరించినప్పటికీ, ఇప్పుడు మెజారిటీ ఎమ్మెల్యేలు రెబెల్స్ వైపు నిలబడటం గమనార్హం.



**చట్టపరమైన సమీకరణాల సంగతేంటీ?**

ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడకుండా ఉండాలంటే మొత్తం 80 మందిలో కనీసం 2/3 వంతు అంటే 54 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ప్రస్తుతానికి రితబ్రత బెనర్జీ వెనుక 58 నుండి 59 మంది ఎమ్మెల్యేలు ఉన్నందున, వారు "నిజమైన టీఎంసీ"గా క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉంది. రెబెల్ వర్గం సమర్పించిన లేఖలో మమతా బెనర్జీని పార్టీ "చైర్‌పర్సన్" గానే పేర్కొన్నారు. అయితే, పార్టీని కార్పొరేట్ శైలిలోకి మార్చడానికి ప్రయత్నిస్తున్నారంటూ అభిషేక్ బెనర్జీ లీడర్‌షిప్‌పై, ఆయన నిర్ణయాలపైనే తాము తిరుగుబాటు చేస్తున్నట్లు అసంతృప్త నేతలు స్పష్టం చేస్తున్నారు. మహారాష్ట్రలో ఏకనాథ్ షిండే తరహాలోనే ఇక్కడ కూడా వ్యూహం అమలవుతోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**కమిటీలు రద్దు చేసిన దీదీ**

ఈ పరిణామాలపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. ఢిల్లీ వర్గాల కుట్రల వల్లే తమ పార్టీని చీల్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, తాము దీనిపై పోరాడతామని కోల్‌కతా ధర్నా వేదికగా ప్రకటించారు. కాగా, పార్టీలో అంతర్గత తిరుగుబాటు తీవ్రం కావడంతో టీఎంసీ అధిష్టానం తక్షణ చర్యలు చేపట్టింది. పశ్చిమ బెంగాల్‌లోని అన్ని రకాల పార్టీ కమిటీలను, అనుబంధ సంఘాలను తక్షణమే రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. త్వరలోనే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, నూతన కమిటీలను పునర్వ్యవస్థీకరిస్తామని స్పష్టం చేసింది. కాగా ఎన్నికల ఓటమి గాయం మానకముందే, సొంత పార్టీ ఎమ్మెల్యేలే మెజారిటీ సంఖ్యతో తిరుగుబాటు చేయడం మమతా బెనర్జీకి అత్యంత ప్రతికూలమైన అంశంగా మారింది. స్పీకర్ తీసుకోబోయే తుది నిర్ణయంపైనే బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా ఎవరికి దక్కుతుందనేది ఆధారపడి ఉంది.

# ఢిల్లీలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలా? కిషన్ రెడ్డివి అన్నీ యాక్షన్లే

## ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, తెలంగాణ బ్యూరో:** ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకలపై భువనగిరి కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. బీజేపీ జాతీయ నాయకులతో పాటు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి టార్గెట్‌గా ఆయన ఘాటు విమర్శలు చేశారు. నిధులు తీసుకురాకుండా కిషన్ రెడ్డి కేవలం డ్రామాలు ఆడుతున్నారని, తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా బీజేపీ రాష్ట్ర నేతలు ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు.

**తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్సే.. గూగుల్‌లో వెతుక్కోండి**

బీజేపీ జాతీయ నాయకుడు నితిన్ నబీన్‌కు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై కనీస అవగాహన లేదని కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. నితిన్ నబీన్ కొత్తగా వచ్చారని, తెలంగాణను ఏర్పాటు చేసింది కాంగ్రెస్ పార్టీనే అన్న విషయం గూగుల్‌లో వెతికినా స్పష్టంగా తెలుస్తుందని ఎద్దేవా చేశారు. ఢిల్లీ వేదికగా బీజేపీ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి 25 మంది ఎంపీలు ఉంటే, తెలంగాణ నుంచి కేవలం 12 మంది ఎంపీలు మాత్రమే ఉన్నారని.. అయినా సరే సోనియా గాంధీని ఒప్పించి తెలంగాణ సాధించామని ఆయన గుర్తు చేశారు. అసలు తెలంగాణ వస్తుందని నాడు కేసీఆర్ కూడా ఊహించలేదని, ఆయన కేవలం టైమ్ పాస్ రాజకీయాలు చేశారని ఆరోపించారు.

**రైతులు, నిధుల విషయంలో బీజేపీది వివక్షే**

పదేళ్ల పాటు బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ రాష్ట్రాన్ని దోచుకుంటే.. కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి తెలంగాణకు ఎన్ని నిధులు తీసుకువచ్చారో సమాధానం చెప్పాలని కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్రం వద్ద తెలంగాణ రైతుల వరి ధాన్యం కొనే పరిస్థితి ఎందుకు లేదని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో కేవలం 38 శాతం ధాన్యం మాత్రమే ఎందుకు కొనుగోలు చేశారని నిలదీశారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్, రామచంద్రరావులకు తెలంగాణ రైతుల పట్ల ఏమాత్రం బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. తుమ్మిడి హెట్టి వద్ద కట్టాల్సిన ప్రాణహిత ప్రాజెక్టును కాదని కేసీఆర్ కట్టిన కళేశ్వరం ప్రాజెక్టు కాస్తా.. ఇప్పుడు 'కూలేశ్వరం'గా మారిందని విమర్శించారు.

**మూసీ దగ్గర కిషన్ రెడ్డి యాక్షన్**


రాష్ట్ర అభివృద్ధి విషయంలో బీజేపీ నేతలు ఏమాత్రం సహకరించడం లేదని ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ అడిగితే.. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశం ఏర్పాటు చేయడానికి రాష్ట్ర బీజేపీ నేతలు ఎందుకు చొరవ తీసుకోరని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం మానుకోవాలని హితవు పలికారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 కోసం కేంద్రం నుంచి 15 శాతం నిధులు అడిగితే ఎందుకు ఇవ్వడం లేదని, అదే తమిళనాడులో మెట్రోకు మాత్రం 60 శాతం నిధులు ఎలా ఇచ్చారని నిలదీశారు. ఇక మూసీ నది ప్రక్షాళనకు నిధులు ఇవ్వకుండా, కిషన్ రెడ్డి అక్కడికి వెళ్లి రివర్ బెడ్ మీద పడుకుని యాక్షన్ చేశారని తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ బాగుపడటం బీజేపీకి ఇష్టం లేదా? అని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు.

## బ్రిటన్‌లో 'పాక్ గ్రూమింగ్ గ్యాంగ్స్' దారుణాలు..

# బాలికపై 700 మంది అత్యాచారం..!

### అమ్మాయిలను బోనుల్లో బంధించి..

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03 :** యునైటెడ్ కింగ్‌డమ్ పార్లమెంట్‌లో బ్రిటిష్ ఎంపీ రూపెర్ట్ లోవ్ చేసిన ప్రసంగం.. అక్కడ దశాబ్దాలుగా నలుగుతున్న 'గ్రూమింగ్ గ్యాంగ్స్' (బాలికలపై లైంగిక దోపిడీకి పాల్పడుతున్న గ్యాంగులు) వివాదాన్ని మరోసారి తీవ్రంగా తెరపైకి తెచ్చింది. స్వతంత్ర రేప్ గ్యాంగ్ విచారణ కమిటీ నిర్వహించిన రెండు వారాల విచారణలో బాధితులు వెల్లడించిన అత్యంత భయంకరమైన సాక్ష్యాలను ఆయన పార్లమెంట్‌లో చదివి వినిపించారు. ఈ దారుణాలు అసలు జరిగి ఉండకూడదని, ఇప్పటికైనా తోటి ప్రజాప్రతినిధులు ఈ ధైర్యవంతులైన బాధితుల గొంతును ఆలకించి, తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు. ఎంపీ రూపెర్ట్ లోవ్ పార్లమెంట్‌కు సమర్పించిన వివరాల ప్రకారం.. ఈ దారుణాల వెనుక ఒక క్రమపద్ధతిలో సాగిన లైంగిక వేధింపులు, హింస, బెదిరింపులు, జాతి వివక్ష, పోలీసుల నిర్లక్ష్యం దాగి ఉన్నాయి. విచారణలో భాగంగా ఒక బాధితురాలు తాను 12 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు ఎదుర్కొన్న ఒక భయంకరమైన సంఘటనను గుర్తుచేసుకుంది. ఒక నిందితుడు ఆమెపై అత్యాచారం చేయడమే కాకుండా, ఖాళీగా ఉన్న జాక్ డానియల్స్ మద్యం సీసాతో ఆమెపై పైశాచికంగా దాడి చేశాడని, ఆ క్రమంలో ఆమె శరీరంలోనే గ్లాస్ ముక్కలు విరిగిపోయాయని సాక్ష్యం చెప్పింది. మరొక బాధితురాలు తాను 13 ఏళ్ల వయసు నుండి దాదాపు మూడేళ్లపాటు 600 నుండి 700 మంది పురుషుల చేతిలో ఘోరమైన అత్యాచారానికి గురయ్యానని కన్నీటి పర్యంతమైంది. బాధితులను లొంగదీసుకోవడానికి, వారిని మానసికంగా కుంగదీయడానికి నిందితులు జాతి, మతాన్ని కూడా ఒక ఆయుధంగా వాడుకున్నట్లు ఈ విచారణలో వెల్లడైంది. శ్వేతజాతీయులు, క్రైస్తవ బాలికలకు నైతిక విలువలు తక్కువగా ఉంటాయంటూ ముస్లిం బాలికలతో పోల్చి నిందితులు మాట్లాడేవారని, ఆ నెపంతో తమపై జరుగుతున్న అరాచకాలను సమర్థించుకునేవారని ఒక బాధితురాలు తెలిపింది. ఆమె మెడలోని సిలువ (క్రాస్) గుర్తును చూసి, "ఇప్పుడు నీ దేవుడు ఎక్కడ ఉన్నాడు? నిన్ను నీ దేవుడే వదిలేశాడు" అంటూ ఎగతాళి చేస్తూ మానసిక హింసకు గురిచేసేవారని పేర్కొంది. కేవలం సాధారణ వ్యక్తులే కాకుండా, దేశంలోని వివిధ ప్రాంతాలలో కొందరు పోలీసు అధికారులు సైతం తమపై అత్యాచారాలకు పాల్పడ్డారని బాధితులు ఆరోపించడం సంచలనం సృష్టించింది. కేవలం నిందితుల పైశాచికత్వమే కాకుండా ప్రభుత్వ వ్యవస్థలు, ఆసుపత్రులు, చిల్డ్రన్ హోమ్స్ సిబ్బంది బాధితులను రక్షించడంలో దారుణంగా విఫలమయ్యారని ఈ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఒక 15 ఏళ్ల బాలిక తీవ్ర రక్తస్రావంతో, కూర్చోలేని స్థితిలో ఆసుపత్రికి వెళ్తే.. భయంతో



ఆమె నిజం చెప్పలేకపోయినప్పటికీ, అక్కడి వైద్య సిబ్బంది ఎలాంటి ప్రశ్నలు అడగకుండా కేవలం మాత్రలు ఇచ్చి పంపించేశారని ఎంపీ లోవ్ గుర్తుచేశారు. నిందితుల్లో అత్యధికులు పాకిస్తానీ నేపథ్యం ఉన్న పురుషులేనని, దాదాపు 85 ప్రాంతాలలో ఈ 'గ్యాంగ్ ఆధారిత బాలల లైంగిక దోపిడీ' నెట్‌వర్క్ విస్తరించి ఉందని గత ఏడాది రూపెర్ట్ లోవ్ నేతృత్వంలో జరిగిన ప్రైవేట్ దర్యాప్తులో తేలింది. ఈ దారుణాలపై త్వరలోనే పూర్తి నివేదికను విడుదల చేయనున్నట్లు ప్రకటించిన ఆయన, బ్రిటిష్ సమాజంలో మార్పు కోసం ఇకనైనా మాటలు కట్టిపెట్టి చేతల్లో చూపించాలని బ్రిటన్ ప్రభుత్వానికి పిలుపునిచ్చారు.

# విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం అవసరం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, నారాయణఖేడ్ :** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండల పరిధిలోని బోరంచ గ్రామంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి. సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్యాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకుమార్ స్వామి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు యశ్వంత్, ఉపాధ్యాయులు మహేష్ కుమార్, అశోక్ రావు, శ్రీధర్, విఠల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతోష్, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యురాలు సాయమ్మ, అంగన్వాడీ టీచర్లు, గ్రామ మహిళా సమాఖ్య వీఓఏ అనుసుయతో పాటు గ్రామస్తులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. పి. సంజీవరెడ్డి



# వడదెబ్బతో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కాసోజు రామ చంద్రయ్య మృతి....



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కాసోజు రామ చంద్రయ్య (82) అనారోగ్యానికి గురై వడదెబ్బతో బుధవారం మృతిచెందాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న రామచంద్రయ్య తీవ్ర ఎండల కారణంగా ఆరోగ్యం మరింత క్షీణించింది. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. సీనియర్ సిటిజన్ ఫోరం మండల శాఖ అధ్యక్షులు బల్ల దామోదర్ ఇతర సభ్యులు రామచంద్రయ్య పట్ల సంతాపం తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు బంధువులు గ్రామస్తులు పలువురు నాయకులు మధ్య అంత్యక్రియలు జరిగాయి.

# బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అంకతి సుదర్శన్ మృతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అంకతి సుదర్శన్ అనారోగ్యం బారిన పడి మృతి చెందాడు. బుధవారం ఉదయం హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందగా రాజపేట స్వగ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. ఆయన మృతి పట్ల బిఆర్ఎస్ నాయకులు ఇతర పార్టీల పెద్దలు గ్రామస్తులు బంధువులు పలువురు మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# కళ్లెం బిక్షపతి కుటుంబానికి ఇంజ నరేష్ ఆర్థిక సాయం...



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం కాల్వపల్లి గ్రామానికీ చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు కళ్లెం బిక్షపతి అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబానికి ఇంజ నర్సయ్య ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ఇంజ నరేష్ 5,000/- రూపాయలు బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాల్వపల్లి సర్పంచ్ ఇంజ లక్ష్మీ, పాలకవర్గం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ నాయకులు గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# వేసవి దాహార్తికి చెక్.. 9వ వార్డులో కొత్త మంచినీటి బోర్‌వెల్ ఏర్పాటు



**హైదరాబాద్ పల్స్, జూన్ 03, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ యంత్రాంగం కీలక చర్యలు చేపట్టింది. మండుతున్న ఎండలు, పెరుగుతున్న నీటి అవసరాల నేపథ్యంలో స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు బుధవారం కొత్త మంచినీటి బోర్‌వెల్‌ను ఏర్పాటు చేశారు. ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా మున్సిపల్ చైర్మన్ కొండేటి రాజకుమారి హరినాథ్, వైస్ చైర్మన్ మదా లావణ్య శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకుని బోర్‌వెల్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వేసవి కాలంలో తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తు చర్యగా ఈ పనులు చేపట్టినట్లు వారు తెలిపారు. ప్రజలకు అవసరమైన ప్రతి సదుపాయాన్ని అందించేందుకు మున్సిపాలిటీ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. కొత్త బోర్‌వెల్ ఏర్పాటు ద్వారా 9వ వార్డులోని పలు ప్రాంతాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రానుండగా, నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు గణనీయమైన ఉపశమనం కలగనుంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తామని మున్సిపల్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, 9వ వార్డు కౌన్సిలర్ బోరగాని శరత్, 5వ వార్డు కౌన్సిలర్ హేమలత, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు. బోర్‌వెల్ ఏర్పాటుతో తమ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనే ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేశారు.

# ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం : ఎమ్మెల్యే డా. సంజీవరెడ్డి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, నారాయణఖేడ్ :** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండలం బోరంచ గ్రామంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో రూ.95 లక్షల వ్యయంతో చేపట్టనున్న తాగునీటి శుద్ధి కేంద్రం పునరుద్ధరణ పనులకు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బోరంచతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఉపయోగపడే ఈ శుద్ధి కేంద్రాన్ని ఆధునిక సౌకర్యాలతో పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు. పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఎన్నో రోజులుగా ఈ పనుల కోసం ఎదురుచూస్తున్న గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించడం పట్ల గ్రామస్తులు, స్థానిక ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పునరుద్ధరణ పూర్తయితే బోరంచ గ్రామంతో పాటు సమీప ప్రాంతాల ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి రానుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్లోళ్ల లోకేష్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భోజీ రెడ్డి, దిగంబర్ రెడ్డి, సిద్ధ రెడ్డి, గ్రామ సర్పంచ్ పంచగామ బీరప్ప, సంజీవ్, గ్రామ ఉపసర్పంచ్ మొల్ల కరిమ్,శివాజీ పాటిల్, ఖరీం, రాజు, అఖిలేష్ రెడ్డి, వెంకటేశం, మల్లయ్య, మతీన్, నర్సింలు, ఆనంద్, సంజీవ రెడ్డి, సర్పంచులు, ఉప సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాయగిరిలో అంగరంగ వైభవంగా దుర్గమ్మ పండుగ జాతర...



**పాల్గొన్న భువనగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** భువనగిరి పట్టణ పరిధిలోని రాయగిరి దుర్గమ్మ పండుగ జాతర బుధవారం రోజు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ జాతర మహోత్సవానికి భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చైర్‌పర్సన్ గారు ఆలయానికి విచ్చేసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ...దుర్గమ్మ తల్లి కరుణాకటాక్షాలతో పట్టణ ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. జాతరకు తరలివచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపాలిటీ తరఫున తాగునీరు, పారిశుధ్యం, వైద్య శిబిరం, లైటింగ్ వంటి అన్ని మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పట్టణ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ ని, పీసీసీ డెలిగేట్ తంగళ్లపల్లి రవికుమార్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, 3వ వార్డు కౌన్సిలర్ పాత్యాల వెంకటేష్, కో-ఆప్షన్ సభ్యులు యాదగిరి, కాంగ్రెస్ నాయకులు ఆవిశెట్టి పాండు, ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# ప్రైవేట్ ఆసుపత్రుల్లో యుడబ్ల్యూఐఎన్ అమలుకు చర్యలు.....

## డిజిటల్ వ్యాక్సినేషన్ సేవలపై అవగాహన శిక్షణ కార్యక్రమం...

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** గర్భిణీలు, చిన్నారులకు అందించే టీకా సేవలను డిజిటల్ విధానంలో నమోదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యుడబ్ల్యూఐఎన్ పోర్టల్ వినియోగంపై జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులకు అవగాహన కార్యక్రమం బుధవారం రోజు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో 52 డెలివరీ పాయింట్లుగా నమోదైన ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లాలో ఇప్పటికే 40 ప్రైవేట్ ఆసుపత్రులు యుడబ్ల్యూఐఎన్ ఐడీలు పొంది గర్భిణీలు, నవజాత శిశువుల వివరాలను నమోదు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ఆసుపత్రులు కూడా వెంటనే పోర్టల్‌లో నమోదు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. యుడబ్ల్యూఐఎన్ ద్వారా గర్భిణీల నమోదు, ప్రసవ వివరాలు, నవజాత శిశువుల నమోదు, జనన నివేదికలు, టీకాల నమోదు, తదుపరి టీకాల ట్రాకింగ్ వంటి సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. టీకా సేవలకు సంబంధించిన సమాచారం, తదుపరి టీకాల తేదీలు ఎస్ఎంఎస్ ద్వారా అందడంతో పాటు వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లు, రికార్డులు డిజిటల్ రూపంలో పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, యుడబ్ల్యూఐఎన్ పోర్టల్ పరిశీలకులు, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్య ప్రతినిధులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# దేశ రాజధానిలో ఘోర అగ్నిప్రమాదం: 21 మంది సజీవదహనం!

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, సెంట్రల్ బ్యూరో:** దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం ఉదయం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దక్షిణ ఢిల్లీలోని మాలవ్య నగర్లో ఉన్న లెమన్ గ్రీన్ రెస్టారెంట్‌లో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగడంతో విదేశీయులతో సహా 21 మంది సజీవదహనమయ్యారు. మృతుల్లో ఎక్కువగా విదేశీయులు ఉన్నట్లు సమాచారం. మరికొంత మంది ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఈ క్రమంలో మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో రెస్టారెంట్ బేస్‌మెంట్‌లో చిక్కుకుపోయిన పలువురిని అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి సురక్షితంగా రక్షించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి.అగ్నిమాపక అధికారులకు అందిన సమాచారం ప్రకారం.. బుధవారం ఉదయం సుమారు 9:45 గంటల సమయంలో ఈ ప్రమాదం గురించి సమాచారం అందింది. వెంటనే స్పందించిన సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే చర్యలు ప్రారంభించారు. రెస్టారెంట్ బేస్‌మెంట్‌లో ఊపిరాడక అల్లాడుతున్న ముగ్గురిని సిబ్బంది ప్రాణాలతో రక్షించి, క్యాట్స్ అంబులెన్స్‌ల ద్వారా తక్షణమే ఆసుపత్రికి తరలించారు. ఢిల్లీ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇప్పటివరకు మొత్తం 11 మందిని ఈ ప్రమాద స్థలం నుంచి సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.ఈ ఘోర ప్రమాదంపై ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు. బాధితులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. “మాలవ్య నగర్ అగ్నిప్రమాదంలో ఎందరో ప్రాణాలు కోల్పోవడం నన్ను తీవ్రంగా కలచివేసింది. మరణించిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను” అని సీఎం రేఖా గుప్తా పేర్కొన్నారు.ప్రమాదం జరిగిన వెంటనే ఢిల్లీ ఫైర్ సర్వీసెస్, ఢిల్లీ పోలీస్, డీడీఎంఏ, క్యాట్స్ అంబులెన్స్ బృందాలు రంగంలోకి దిగాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. వారి సత్వర స్పందన కారణంగానే బేస్‌మెంట్, ఇతర ప్రాంతాల నుంచి పలువురిని సురక్షితంగా ఖాళీ చేయించడం సాధ్యమైందని ఆమె కొనియాడారు. ఢిల్లీ ప్రభుత్వం పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని, బాధితులకు అవసరమైన అన్ని రకాల వైద్య సహాయాన్ని అందిస్తున్నామని స్పష్టం చేశారు. నెహ్రూ ప్లేస్ ఫైర్



స్టేషన్‌కు చెందిన డివిజనల్ ఆఫీసర్ రవీందర్ స్వయంగా ఘటనా స్థలంలోనే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అయితే ఈ భారీ ప్రమాదానికి గల అసలు కారణాలు ఇంకా తెలియరాలేదు, దీనిపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

## హూన్యతండాలో ఆధ్యాత్మికతతో సేవా సందేశం..

# వర్షాల కోసం ప్రత్యేక పూజలు, ప్రజలకు మజ్జిగ పంపిణీ



**హైదరాబాద్ పల్స్, జూన్ 03, మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి:** గ్రామ ప్రజల సంక్షేమం, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ఆకాంక్షిస్తూ డోర్నకల్ మండలం హూన్యతండాలోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి, శ్రీశ్రీశ్రీ హద్దుసాద్ మహారాజ్ ఆలయాలలో ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. శ్రీ హద్దులాల్ మహారాజ్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి జలాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని ప్రార్థించారు. అలాగే పచ్చని పంటలు పండుతూ రైతులు సుభిక్షంగా ఉండాలని, పశు సంపద అభివృద్ధి చెందాలని దేవతలను వేడుకున్నారు. అనంతరం ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో గ్రామ ప్రధాన వీధుల్లో ట్రస్టు సభ్యులు ప్రజలకు, బాటసారులకు చల్లటి మజ్జిగను పంపిణీ చేశారు. వడగాల్పుల నుండి ఉపశమనం కలిగించేందుకు చేపట్టిన ఈ సేవా కార్యక్రమానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శ్రీ హద్దులాల్ మహారాజ్ ఆశీస్సులతో గ్రామంలో ఆధ్యాత్మిక, ధార్మిక, విద్యా మరియు సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ సమాజాభివృద్ధికి ట్రస్టు కృషి చేస్తోందని సభ్యులు తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్న ట్రస్టు సభ్యులను గ్రామస్తులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు గ్రామాల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

# తెలంగాణలో భూముల ధరలు పెంపు.. జూన్ 5 నుంచి అమల్లోకి..

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో సవరించిన భూముల ధరలు జూన్ 5 నుంచి అమల్లోకి రానున్నాయి. భూముల ధరలను క్రమబద్ధీకరించాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం మేరకు ధరలను సవరిస్తున్నట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. భూముల విలువల సవరణను శాస్త్రీయంగా, హేతుబద్ధంగా చేపట్టినట్లు పేర్కొన్నారు. ఆర్థిక నిపుణులు అరవింద్ సుబ్రమణ్యం ఇచ్చిన నివేదిక మేరకు ఉన్నతాధికారుల సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుని విస్తృత స్థాయిలో అధ్యయనం నిర్వహించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి వివరించారు. ప్రాంతాల వారీగా మార్కెట్ ధరలు, రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ విలువల మధ్య వ్యత్యాసాలను పరిశీలించి శాస్త్రీయ పద్ధతిలో కొత్త విలువలను నిర్ణయించామన్నారు.గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం ఎలాంటి సమగ్ర కసరత్తు లేకుండా.. అశాస్త్రీయ పద్ధతుల్లో 2021-22 సంవత్సరాల్లో కేవలం 6 నెలల వ్యవధిలోనే రెండు సార్లు భూముల ధరలను పెంచడంతో పాటు రిజిస్ట్రేషన్ ఛార్జీలను 6 శాతం నుంచి 7.5 శాతానికి పెంచిందని మంత్రి పొంగులేటి గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన సవరణలు క్షేత్రస్థాయి అధ్యయనం లేకుండా కేవలం శాతం గణనల ఆధారంగా, పట్టికల ప్రకారం చేపట్టడం వల్ల కొన్ని ప్రాంతాల్లో మార్కెట్ విలువ కంటే చాలా తక్కువగా, మరికొన్ని ప్రాంతాల్లో అధికంగా విలువలు నిర్ణయించినట్లు స్పష్టం చేశారు.వాస్తవ మార్కెట్ ధరలకు.. ప్రభుత్వ విలువలకు మధ్య భారీ అంతరం ఉండటం వల్ల భూ లావాదేవీలలో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని.. ఈ పరిస్థితులను సరిదిద్దేందుకు రాష్ట్రంలోని అన్ని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో మార్కెట్ విలువల పునర్విమర్శ చేపట్టామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. గ్రామీణ, పట్టణ మార్కెట్ విలువల సవరణ కమిటీలు స్థానిక పరిస్థితులను పరిశీలించి సవరించిన విలువలను



రూపొందించి ఆమోదించాయని పేర్కొన్నారు.ఇక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా.. వాస్తవ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఈ సవరణలు చేపట్టినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, భూ లావాదేవీలలో పారదర్శకత పెంపునకు, ప్రభుత్వ ఆదాయ వృద్ధికి ఈ నిర్ణయం దోహదపడుతుందని పేర్కొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాద ఘటన స్థలిని పరిశీలించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ఎర్రగుంటపల్లి సమీపంలో గొర్రెల లోడుతో వెళ్తున్న డీసీఎం లు ఒకదానితో ఒకటి ఢీ**

**గొర్రెల రైతు చిటకొండ ఎల్లయ్య, అక్కడికక్కడే మృతి**

**ప్రమాదంలో సుమారు 300 గొర్రెలు మృతి**

**మంత్రులకు, కలెక్టర్ కి ఫోన్ చేసి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు**

**రైతు కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తరపున అవసరమైన సహాయం అందించేందుకు కృషి**

**తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందజేత**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 03, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** దేవరకొండ నియోజకవర్గం డిండి మండలం ఎర్రగుంటపల్లి సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య. దేవరకొండ నియోజకవర్గం డిండి మండలం ఎర్రగుంటపల్లి సమీపంలో గొర్రెల లోడుతో వెళ్తున్న డీసీఎం లు ఒకదానితో ఒకటి ఢీ కొనగా ఈ ప్రమాదం ఏర్పడి విషాద ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో సుమారు 300 గొర్రెలు మృతి చెందగా, నాగర కర్నూల్ జిల్లా కోడూరు మండలానికి చెందిన గొర్రెల రైతు చిటకొండ ఎల్లయ్య, అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అలాగే ఆయన భార్య, కుమారుడు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ దుర్ఘటన విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, స్థానిక ఎమ్మెల్యే బాలు నాయక్, తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం చైర్మన్ ఎగ్గె మల్లేశం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ క్యామ మల్లేశం, ఫిష్ అండ్ గోట్ కార్పొరేషన్ చైర్మన్ సరిత తిరుపతయ్యతో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. సంఘటన స్థలంలో, మంత్రి వాకిటి శ్రీహరితో మంత్రి జూపల్లి కృష్ణారావుతో, కలెక్టర్ కి ఫోన్ చేసి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాద స్థలంలో మృతిచెంది పడి ఉన్న వందలాది గొర్రెలను చూసి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన బీర్ల ఐలయ్య, అనంతరం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి గాయపడిన కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. అలాగే మార్చరీలో ఉన్న రైతు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ



సానుభూతి తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు ఓదార్పునిచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కురుమ సంఘం అన్ని విధాలుగా అండగా ఉంటాయని భరోసా కల్పించారు. పిల్లల చదువుకు అండగా ఉంటామన్నారు. ఈ ఘటన ఎంతో బాధాకరమని, రైతు కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం తరపున అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తామని బీర్ల ఐలయ్య తెలిపారు.



# థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు ఎలాంటి ఆహారాలను తీసుకోవాలి.. వేటిని మానేయాలి..?



శరీరంలోని జీవక్రియలను నియంత్రించే ముఖ్యమైన ఎండోక్రైన్ గ్రంథుల్లో థైరాయిడ్ ఒకటి. ఈ గ్రంథి సక్రమంగా పనిచేయకపోతే అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా దేశంలో థైరాయిడ్ సంబంధిత సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. అందుకే థైరాయిడ్ ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో సరైన ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. థైరాయిడ్ గ్రంథికి సంబంధించిన వ్యాధులు ప్రధానంగా రెండు రకాలుగా ఉంటాయి. థైరాయిడ్ హార్మోన్లు తక్కువగా ఉత్పత్తి కావడం వల్ల హైపోథైరాయిడిజం వస్తుంది. ఇది మహిళల్లో ఎక్కువగా కనిపిస్తుంది. మరోవైపు, థైరాయిడ్ హార్మోన్లు అధికంగా ఉత్పత్తి అయితే హైపర్ థైరాయిడిజం ఏర్పడుతుంది. ఈ రెండు పరిస్థితులపై కూడా ఆహారపు అలవాట్లు గణనీయమైన ప్రభావం చూపుతాయి.

**మెడిటరేనియన్ డైట్ అయితే బెటర్..**

హైపోథైరాయిడిజం ఉన్నవారు మెడిటరేనియన్ డైట్‌ను అనుసరించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఈ ఆహార విధానంలో పండ్లు, కూరగాయలు, బ్రౌన్ రైస్, ఓట్స్, బార్లీ, సంపూర్ణ గోధుమలు, గింజలు, నట్స్, ఆలివ్ ఆయిల్ వంటి ఆరోగ్యకరమైన కొవ్వులు, అలాగే బీన్స్, చేపలు, కోడి మాంసం, పెరుగు, చీజ్ వంటి ప్రోటీన్ ఆహారాలు ఉంటాయి. ఈ డైట్‌లో ఉండే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు థైరాయిడ్ ఆరోగ్యానికి మేలు చేస్తాయి. అలాగే ప్రాసెస్ చేయని సహజ ఆహారాలతో కూడిన పాలియో డైట్ కూడా ఉపయోగకరంగా ఉంటుంది. అయితే బ్రోకోలీ, కాలీఫ్లవర్, ముల్లంగి, క్యాబేజీ వంటి క్రూసిఫెరస్ కూరగాయలను పచ్చిగా ఎక్కువగా తినడం వల్ల థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది.

**అయోడిన్ ముఖ్యపాత్ర..**

థైరాయిడ్ హార్మోన్ల తయారీలో అయోడిన్ కీలకమైన పాత్ర పోషిస్తుంది. అయోడిన్ లోపం హైపోథైరాయిడిజానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా భావిస్తారు. అయోడైజ్డ్ ఉప్పు వాడని వారు, పూర్తిగా వెగన్ ఆహారం తీసుకునేవారు, గర్భిణులు అయోడిన్ లోపానికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉంటుంది. సముద్రపు శైవలాలు, సముద్ర ఆహారం, పాల ఉత్పత్తులు, గుడ్లు కూడా అయోడిన్‌కు మంచి వనరులు. అయితే హషిమోటో థైరాయిడిటిస్ వంటి ఆటోఇమ్యూన్ థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు అధికంగా అయోడిన్ తీసుకోవడం వల్ల సమస్యలు పెరిగే అవకాశం ఉన్నందున జాగ్రత్త అవసరం. సెలీనియం అనే ఖనిజం థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తికి తోడ్పడటంతో పాటు గ్రంథిని ఆక్సిడేటివ్ ఒత్తిడి నుంచి రక్షిస్తుంది. ట్యూనా చేప, గుడ్లు, బ్రెజిల్ నట్స్, పప్పుధాన్యాలు, సార్డిన్ చేపలు, ఓట్స్ వంటి ఆహారాల్లో సెలీనియం లభిస్తుంది. అయితే అధికంగా సెలీనియం తీసుకోవడం వల్ల విషపూరిత ప్రభావాలు కలిగే ప్రమాదం ఉంటుంది.

**జింక్ లోపం ఉంటే..**

జింక్ లోపం కూడా థైరాయిడ్ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తుంది. గుమ్మడికాయ గింజలు, ఆయిస్టర్‌లు, నట్స్, పప్పుధాన్యాలు జింక్‌కు మంచి వనరులు. అయితే వైద్యుల సలహా లేకుండా అధిక మోతాదులో జింక్ తీసుకోవడం వల్ల దుష్ప్రభావాలు తలెత్తే అవకాశం ఉంటుంది. విటమిన్ డి, విటమిన్ బి12, ఐరన్, మెగ్నీషియం లోపాలు కూడా హైపోథైరాయిడిజం ప్రమాదాన్ని పెంచుతాయి. సూర్యరశ్మి, కొవ్వు అధికంగా ఉండే చేపలు, గుడ్డు పచ్చసొన, పాల ఉత్పత్తులు విటమిన్ డికి మంచి వనరులు. విటమిన్ బి12 ప్రధానంగా జంతు ఆధారిత ఆహారాల్లో లభిస్తుంది. గుమ్మడికాయ గింజలు, అవిసె గింజలు, చియా గింజలు, బాదం, జీడిపప్పు, ఆకుకూరలు, అరటిపండ్లు, పెరుగు వంటి ఆహారాల్లో మెగ్నీషియం సమృద్ధిగా ఉంటుంది. పాలకూర, ఫోర్టిఫైడ్ సిరియల్స్, సముద్ర ఆహారం, శనగలు, టోఫూ వంటి ఆహారాల్లో ఐరన్ లభిస్తుంది. ఐరన్ అధికంగా ఉన్న ఆహారాలతోపాటు నిమ్మ, నారింజ వంటి సిట్రస్ పండ్లు తీసుకుంటే శరీరం ఐరన్‌ను మరింత సమర్థంగా గ్రహిస్తుంది.థైరాయిడ్ సమస్యలు ఉన్నవారు ముఖ్యంగా అల్ట్రా-ప్రాసెస్డ్ ఆహారాలను తగ్గించడం మంచిది. ఇవి శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను పెంచే అవకాశం ఉంది. హైపర్ థైరాయిడిజం ఉన్నవారు అధిక అయోడిన్, కెఫిన్, సోయా ఉత్పత్తులు, గ్లూటెన్ ఎక్కువగా ఉండే ఆహారాలను పరిమితం చేయాలి. సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, ఒత్తిడిని తగ్గించే పద్ధతులు, తగినంత నిద్ర, ఆరోగ్య పరీక్షలు, అనారోగ్యకరమైన ఆహారాలకు దూరంగా ఉండటం ద్వారా థైరాయిడ్ ఆరోగ్యాన్ని మెరుగ్గా కాపాడుకోవచ్చు.

# వేసవి కాలంలో రోజంతా బయట పనిచేసేవారు పాటించాల్సిన జాగ్రత్తలు ఇవే..

వేసవి కాలం బయట పని చేసే కార్మికులకు ఒక పెద్ద సవాల్ లాంటిదని చెప్పవచ్చు. నిర్మాణ కార్మికులు, రోడ్డు పని చేసేవారు, వ్యవసాయ కూలీలు, వీధి వ్యాపారులు, రోజువారీ కూలీలు వంటి వారు మండే ఎండలో గంటల తరబడి పనిచేయాల్సి వస్తుంది. అలాంటి పరిస్థితుల్లో ఆహారం కేవలం ఆకలి తీర్చడానికే కాదు, శరీరానికి శక్తిని అందించడానికి, నీటి లోపాన్ని తగ్గించడానికి, అలసటను ఎదుర్కోవడానికి కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఎండలో పని చేసే కార్మికులు వేసవికాలంలో ఈ ఆహారాలను తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ఇవి తక్కువ ఖర్చుతో లభించడమే కాకుండా, శరీరానికి చల్లదనాన్ని అందించి తీవ్రమైన వేడిని తట్టుకునే శక్తిని ఇస్తాయి. వేసవిలో కార్మికులు భోజనంలో పెరుగు తప్పనిసరిగా తీసుకోవాలి. ఇది శరీరానికి చల్లదనాన్ని అందించడమే కాకుండా జీర్ణక్రియకు కూడా మేలు చేస్తుంది. అధిక ఉష్ణోగ్రతల వల్ల ఆకలి తగ్గినప్పుడు కూడా పెరుగును సులభంగా తినగలుగుతారు. చాలామంది పెరుగును అన్నంతో కలిపి లేదా రోటీతోపాటు తీసుకుంటారు. ఇది శరీరానికి ఉపశమనం కలిగించడంతోపాటు తేలికైన పోషణను అందిస్తుంది.

**పెరుగు, మజ్జిగ, కూరగాయలు..**

పెరుగుతోపాటు మజ్జిగను కూడా కార్మికులు వేసవి ఆహారంలో ముఖ్యమైన భాగంగా చేసుకోవాలి. రోజంతా చెమటలు పట్టే పనులు చేసే వారికి మజ్జిగ దాహాన్ని తగ్గించి శరీరాన్ని తాజాగా ఉంచుతుంది. జీలకర్ర పొడి, ఉప్పు లేదా పుదీనాతో తయారు చేసే మజ్జిగ మరింత రుచికరంగా ఉండటంతోపాటు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. తక్కువ సమయంలో తాగగలిగే ఈ పానీయం ఎండలో పనిచేసే వారికి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. అధిక మసాలాలు, నూనెతో చేసిన ఆహారం వేసవిలో భారంగా అనిపిస్తుంది. కనుక పెరుగన్నం, పప్పన్నం లేదా తేలికపాటి ఖిచిడీ వంటి ఆహారాలను ఎంచుకోవాలి. ఇవి కడుపుని నింపడంతోపాటు శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ముఖ్యంగా అన్నం త్వరగా జీర్ణమై శరీరానికి తక్షణ శక్తిని అందించడంలో సహాయపడుతుంది. ఉల్లిపాయ, దోసకాయ, నిమ్మకాయ, టమాటా వంటి ముడి కూరగాయలు కూడా వేసవిలో కార్మికుల భోజనంలో తరచూ కనిపిస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి చల్లదనం లభిస్తుంది. ముఖ్యంగా దోసకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండటంతో దాహాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. ఉల్లిపాయ, పచ్చిమిర్చి, ఉప్పుతో కలిసి తింటే భోజనానికి రుచి పెరగడంతోపాటు వేడి ప్రభావాన్ని కూడా కొంత మేర తగ్గిస్తుంది.

**కొబ్బరినీళ్లు, పండ్లు..**

అవకాశం ఉన్నప్పుడు కొబ్బరి నీరు, సీజనల్ పండ్లు కూడా కార్మికులు ఆహారంలో భాగంగా తీసుకోవాలి. కొబ్బరి నీరు శరీరాన్ని త్వరగా హైడ్రేట్ చేయడంలో సహాయపడుతాయి. పుచ్చకాయ, తర్బూజా



వంటి పండ్లు అధిక నీటి శాతంతో ఉండటంతో వేసవిలో శరీరానికి చల్లదనం అందిస్తాయి. మామిడి పండ్లు కూడా శక్తినిస్తాయి కానీ ఎక్కువగా తీసుకుంటే భారంగా అనిపించే అవకాశం ఉంటుంది కనుక మితంగా తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. చాలా మంది కార్మికులు ఉదయం ఇంటి నుంచి తీసుకెళ్లే రోటీలు, కూరలపై ఆధారపడతారు. కనుక సొరకాయ, బీరకాయ, గుమ్మడికాయ, ఆలుగడ్డ వంటి సీజనల్ కూరగాయలతో చేసిన సాధారణ కూరలను ఎక్కువగా తీసుకోవాలి. ఇవి ఎక్కువసేపు నిల్వ ఉండటమే కాకుండా జీర్ణక్రియకు కూడా అనుకూలంగా ఉంటాయి. తక్కువ నూనె, కొద్దిపాటి ఉప్పుతో తయారుచేసే ఈ భోజనం శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తుంది.

**సత్తు పానీయం..**

ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాల్లో సత్తు వేసవిలో అత్యంత ప్రజాదరణ పొందిన ఆహారాల్లో ఒకటి. నీటిలో సత్తు, నిమ్మరసం, ఉప్పు కలిపి తాగడం వల్ల శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ఇది ఒకేసారి దాహాన్ని తీర్చడమే కాకుండా పొట్టని కూడా నింపుతుంది. అలాగే అటుకులు వంటి తేలికపాటి ధాన్యాలతో తయారుచేసిన ఆహారాలు కూడా సులభంగా జీర్ణమై శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి.వేసవిలో కార్మికులు ఈ సంప్రదాయ ఆహారాలు తీసుకోవడం ద్వారా కేవలం ఆకలి తీరడమే కాదు, మండే ఎండను ఎదుర్కొనే శక్తిని అందించే సహజ రక్షణ కవచాలుగా కూడా పనిచేస్తాయి. తక్కువ ఖర్చుతో, సులభంగా లభించే ఈ ఆహారాలు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు చెబుతున్నారు.

# రాత్రి భోజనం చేశాక కాసేపు నడిస్తే ఎన్నో లాభాలు.. రోజూ చేయాలంటున్న వైద్యులు..



భోజనం చేసిన వెంటనే కొద్దిసేపు నడవడం ఇప్పుడు సోషల్ మీడియాలో ఫార్ట్ వాక్స్ పేరుతో వైరల్ అవుతోంది. అయితే ఇది కొత్త అలవాటు కాదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. భోజనం తర్వాత స్వల్పంగా నడవడం జీర్ణక్రియకు చాలా కాలంగా సూచిస్తున్న సరళమైన అలవాట్లలో ఒకటని వివరిస్తున్నారు. ఈ చిన్న నడక కేవలం ఆహారం జీర్ణం కావడానికే కాదు, కడుపులో గ్యాస్, ఉబ్బరం తగ్గించడంలో, మలబద్ధకం తగ్గించడంలో, అలాగే రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా సహాయపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. జీర్ణాశయ ఆరోగ్య నిపుణుల ప్రకారం భోజనం చేసిన తర్వాత 5 నుంచి 15 నిమిషాల పాటు నెమ్మదిగా నడవడం వల్ల జీర్ణవ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది. ఇంటి చుట్టూ, ఆఫీస్‌లో, ట్రెడ్‌మిల్‌పై లేదా బయట వీధిలో నెమ్మదిగా నడిచినా సరిపోతుందని చెబుతున్నారు. ముఖ్యంగా ఈ సమయంలో కఠినమైన వ్యాయామం చేయకుండా సాదాసీదా నడక మాత్రమే చేయాలని సూచిస్తున్నారు.

గ్యాస్ బయటకు వెళ్తుంది..

భోజనం తర్వాత నడక వల్ల ఆహారం పేగుల్లో సులభంగా కదలడంలో సహాయం జరుగుతుంది. దీని వల్ల కడుపులో చిక్కుకుపోయిన గ్యాస్ బయటకు వెళ్లేందుకు అవకాశం ఉండి ఉబ్బరం తగ్గుతుంది. అలాగే పేగుల కదలికలు మెరుగుపడి మల విసర్జన సులభమవుతుంది. యాసిడ్ రిఫ్లక్స్ సమస్యతో బాధపడేవారికి కూడా ఈ అలవాటు కొంత ఉపశమనం ఇస్తుంది. భోజనం చేసిన వెంటనే పడుకోవడం లేదా కూర్చోవడం కంటే కొద్దిసేపు నడవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడి అసౌకర్యం తగ్గుతుంది. ఈ అలవాటులో ప్రత్యేకమైన పరికరాలు, ఖరీదైన ఫిట్‌నెస్ సామగ్రి అవసరం లేదు. ఎవరైనా సులభంగా రోజువారీ జీవితంలో భాగం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఎక్కువసేపు కూర్చునే ఉద్యోగాలు చేసే వారికి భోజనం తర్వాత చిన్న నడక శరీరానికి చలనం కలిగించి ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

ఎలా నడవాలి..

ఫార్ట్ వాక్స్ చేయాలంటే ముందుగా భోజనం పూర్తి చేసిన తర్వాత కొద్దిసేపు ఆగాలి. ఆ తర్వాత నెమ్మదిగా, ఒత్తిడి లేకుండా నడవాలి. వేగంగా పరుగులు తీయడం లేదా గట్టిగా వ్యాయామం చేయడం మంచిది కాదు. రోజూ రాత్రి భోజనం తర్వాత ఇలా కొద్దిసేపు నడిస్తే జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. సాధారణంగా కనిపించే ఈ అలవాటు దీర్ఘకాలంలో మంచి ఆరోగ్యానికి దోహదపడుతుంది. ముఖ్యంగా జీర్ణక్రియ సమస్యలు, గ్యాస్, మలబద్ధకం వంటి ఇబ్బందులు తరచూ ఎదురయ్యే వారు ఈ అలవాటును ప్రయత్నించవచ్చు.

## మోదుగ.. ఆరోగ్యానికి ఆమోదమే

మన ఆహార సంస్కృతిలో ప్రతీ ఆకుకీ, ప్రతీ కాయకీ, ప్రతీ విత్తనానికీ ఒక ఆరోగ్య తత్వం దాగి ఉంది. మోదుగ ఆకులు ఔషధానికే కాదు ఆహారానికి కూడా పనికొస్తాయి. విష రసాయన పూరిత ఆహార ద్రవ్యాల బారి నుంచి మనల్ని మనం కాపాడు కోవటానికి ఇలాంటి ప్రత్యామ్నాయ ద్రవ్యాల వెదకులాట కూడా అవసరమే!....అగ్నిపూలు: మోదుగ చెట్టు అడవిలా పెరిగే మహావృక్షం. దీని పూలు చిలుక ముక్కు ఆకారంలో ఉంటాయి కాబట్టి 'కింశుక' అన్నారు. ఎర్రటి జ్వాలల్లా విరబూస్తాయి కాబట్టి అగ్నిపూలు (ఫ్లేమ్ ఆఫ్ ది ఫారెస్ట్) అంటారు. బాగానే ఉంది గానీ, చాలా పొగరుగా 'బాస్టర్డ్ టేక్' అంటూ ఈ భారతీయ పూజనీయ వృక్షాన్ని కించపరచటమే అభ్యంతరకరం. మోదుగ గింజల్ని తెలుగులో 'మోదుగమాడ' లంటారు. ఈ గింజలు పూర్వకాలపు మాడలనే నాణెం ఆకారంలో ఉండటమే కారణం.విస్తరి: మోదుగ ఆకులతో విస్తళ్లు కుట్టి అందులో భోజనం చేస్తే వాతవ్యాధులు, కఫ వ్యాధుల్లో మేలు చేస్తుందని ఆయుర్వేద గ్రంథాలు చెప్తున్నాయి. అడ్డాకు విస్తళ్ళకన్నా మోదుగాకు విస్తళ్ళు ఆరోగ్యదాయకం. మోదుగలో రసాయనాలు ఉత్తమమైన క్షారగుణాలు కలిగి ఉంటాయి కాబట్టి దీన్ని 'క్షారశ్రేష్ఠ' అంటారు.కూర: లేత మోదుగ ఆకులు చిరుచేదుగా ఉంటాయి. ఎర్రతోటకూర లేదా పెరుగుతోటకూరతో ఈ ఆకుల్ని కలిపి తరిగి ఉడికించి, నీటిని వార్చేస్తే చేదు తగ్గుతుందని పాకదర్పణం గ్రంథంలో నలుడు ఒక ఉపా యం చెప్పాడు. దీనికి తగినంత చుక్కకూర, చింత చిగురు లేదా చింతపండు లాంటి పులుపు ద్రవ్యాల్ని కలిపి సుగంధద్రవ్యాలు చేర్చి ఇగురుకూర వండుకోవాలన్నాడు. కఫ వ్యాధులతోనూ, వాతవ్యాధులతోనూ, మానని వ్రణాలతోనూ ఇన్‌ఫెక్షన్లతోనూ సతమతమయ్యే వారికి తరచూ మోదుగ లేతాకుల కూర వండిపెడుతూ ఉంటే ఆయా వ్యాధులకు వాడే ఔషధాలు శక్తివంతంగా పనిచేస్తాయన్నాడు.ఔషధంగా: జీర్ణకోశవ్యాధులు, కడుపులో పెరిగే ఎలికపాముల మీద పనిచేస్తుందనీ, అతిసార వ్యాధిని, అమీబియాసిస్ వ్యాధిని తగ్గిస్తుందనీ, షుగరు వ్యాధి ఉన్నవారికి మేలు చేస్తుందనీ నలుడు వివరించాడు.



స్త్రీపురుష లైంగిక శక్తి బలపడుతుంది. విరేచనం అయ్యేలా చేస్తుంది. లివర్ వ్యాధుల్లో పనిచేస్తుంది. పొట్టలోపల అవయవాలలో ఏర్పడే వాపుని తగ్గిస్తుంది. నడుము చుట్టూ ఉన్న అవయవాలకు రక్తప్రసారం పెరిగేలా చేస్తుంది. చర్మవ్యాధుల మీద కూడా వీటికి ఔషధ ప్రయోజనం ఉంది.

టీ : మోదుగ ఆకుల్ని ఎండించి దంచిన పొడితో టీ కాచుకుని రోజూ రెండు పూటలా తీసుకుంటూ ఉంటే చాలా ప్రయోజనాలు కలుగుతాయి. కడుపులో పెరిగే ఎలికపాములు కొట్టుకుపోతాయి. విరిగిన ఎముకలు త్వరగా అతుక్కునే గుణం కూడా ఉంది. ఎముక పుష్టినిస్తుంది. మెనోపాజ్ ఎదుర్కొంటున్న స్త్రీలకు మంచిది. సొరియాసిస్ లాంటి చర్మవ్యాధుల మీద పనిచేస్తుంది. షుగరు వ్యాధి, మూత్ర పిండాల వ్యాధుల్లో దీనికి ఎక్కువ ప్రయోజనాలున్నాయి. కాకరకాయల దోషాలకు మోదుగ విరుగుడు. అందుకని కాకరతో వంటకాలు చేసేప్పుడు లేత మోదుగ ఆకు ఒకటి రెండు కలిపి వండితే కాకర పడకపోవటం ఉండదు.తంత్ర విద్యలో ఒక యోగం: మోదుగ గింజల్ని మెత్తగా దంచి ఉసిరికాయల రసం పోసి 7 రోజులపాటు, ఆ తరువాత ఆవుపాలు పోసి 7 రోజుల పాటు నానబెట్టి, ఎండించిన పొడిని పావు నుండి అర చెంచా మోతాదులో తేనెతో రోజూ ఉదయాన్నే విధిప్రకారం తీసుకుని పాలు తాగుతుంటే దూరదృష్టి కలుగుతుందని తంత్ర శాస్త్ర గ్రంథాల్లో ఉంది.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.